
ఆంధ్రజ్యోతి
ఉష్ణోగ్రత శనివారం గరిష్ఠం : 37.0 కనిష్ఠం : 27.0
ANDHRAJYOTHY 5

శ్రీ సత్యసాయి జిల్లా వార్తలు
ఆదివారం 20 ఏప్రిల్ 2025

బాబు మంచితనంతో
రాష్ట్రం అభివృద్ధి
బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత


భూమిపూజ చేస్తున్న మంత్రి సవిత

పెనుకొండ టౌన్, ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మంచితనంతోనే రాష్ట్రం అభివృద్ధిలో పరుగులు పెడుతోందని బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత పేర్కొన్నారు. నగర పంచాయతీ పరిధిలో శనివారం పలు అభివృద్ధి కార్యక్రమాలకు ఆమె భూమిపూజ చేశారు. తొలుత స్వచ్ఛభారత్ కార్యక్రమంలో భాగంగా పట్టణంలోని బాలికల పాఠశాల వద్ద విద్యార్థులు, అధికారులు, నాయకులతో మంత్రి స్వచ్ఛ భారత్‌పై ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం ఎగువ గడ్డ, పాత పోస్టాఫీసు తదితర ప్రాంతాల్లో అభివృద్ధి పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి సవిత మాట్లాడుతూ ఐదేళ్ల వైసీపీ పాలనలో భూకబ్జాలు, దాడులు, కక్షసాధింపుతోనే సరిపెట్టి అభివృద్ధిని గాలికి వదిలేశారని మండిపడ్డారు. వైసీపీ నాయకులు ప్రజల సంక్షేమం, సమస్యలు, అభివృద్ధి కోసం ఎప్పుడూ రోడ్డెక్కలేదన్నారు. వైసీపీ చీప్ ట్రిక్స్‌తో ప్రజల్లో సానుభూతి పొందాలని చూస్తోందన్నారు. ఐదేళ్లలో రాష్ట్రంలో ఏం అభివృద్ధి చేశారో చూపాలని సవాల్ విసిరారు. త్వరలో రూ.103కోట్లతో ఇంటింటికి తాగు నీటి సౌకర్యం ఏర్పాటు చేస్తామన్నారు. అంతకు ముందు స్థానిక నాయకులు బాబుల్‌రెడ్డి, కృష్ణమూర్తి, మంత్రికి ఘనంగా స్వాగతం పలికి శాలువ, పూలమాలలతో సన్మానించారు. కార్యక్రమంలో కేశవయ్య, శ్రీరాములు, సూరీ, త్రివేంద్ర, రఘు, రామలింగ, వీజీపాళ్యం శ్రీనివాసులు, రమణమ్మ, సిద్దయ్య పాల్గొన్నారు.

ఈ-వ్యర్థాలు మానవాళికి
ప్రమాదకరం
స్వర్ణ ఆంధ్ర - స్వచ్ఛ ఆంధ్ర ర్యాలీలో కలెక్టర్ టీఎస్ చేతన్



ర్యాలీలో పాల్గొన్న కలెక్టర్ టీఎస్ చేతన్

పుట్టపర్తి టౌన్, ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి): ఎలక్ట్రానిక్ వ్యర్థాలు మానవాళి మనుడుగకు ప్రమాదకరమని కలెక్టర్ టీఎస్ చేతన్ పేర్కొన్నారు. శనివారం స్వర్ణ ఆంధ్ర - స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా జిల్లా పంచాయతీ, నగర పాలక సంస్థల ఆధ్వర్యంలో ఈ-వ్యర్థాలపై నిర్వహించిన అవగాహన ర్యాలీలో కలెక్టర్ పాల్గొన్నారు. సూపర్‌స్పెషాలిటీ ఆసుపత్రి వద్ద నుంచి వై జంక్షన్ వరకు విద్యార్థులు, మహిళలు, అధికారులతో కలిసి ర్యాలీ చేశారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. గృహాలు, కార్యాలయాలు, వాణిజ్య, వ్యాపార సంస్థల్లో పాడైన ఎలక్ట్రానిక్ పరికరాలు, వస్తువులను శాస్త్రీయ పద్ధతుల్లో రీసైక్లింగ్ చేయాలని అన్నారు. ప్రజలు తమ ఇళ్లలో పాడైన ఎలక్ట్రానిక్ పరికరాలు, వ్యర్థాలను నగరపాలక సంస్థ ఏర్పాటు చేసిన ఈ-వ్యర్థాల కేంద్రంలో అందించాలని తెలిపారు. అనంతరం ప్రజలు, అధికారులతో మానవహారం ఏర్పాటు చేసి ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో పుట్టపర్తి మున్సిపల్ చైర్మన్ తుంగాల ఓబులపతి, జిల్లా వ్యవసాయాధికారి సుబ్బారావు, డీఈఓ క్రిష్టప్ప, పశుసంవర్థక శాఖ జేడీ శుభదాస్, డీఎంహెచ్ఓ ఫిరోజ్‌బేగం, మున్సిపల్ కమిషనర్ ప్రహ్లాద పాల్గొన్నారు.

22న హిందూపురంలో మెగా జాబ్‌మేళా

రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఈనెల 22న హిందూపురంలోని బాలాజీ విద్యావిహార్ డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన మెగా జాబ్‌మేళాను సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ టీఎస్ చేతన్ పిలుపునిచ్చారు. శనివారం జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో జాబ్‌మేళా పోస్టర్లను కలెక్టర్ విడుదల చేశారు. జాబ్‌మేళాలో 20 బహుళ జాతి కంపెనీలు పాల్గొంటాయన్నారు. 18 నుంచి 30 సంవత్సరాలలోపు అభ్యర్థులు పాల్గొనవచ్చన్నారు. అర్హతలను బట్టి రూ.10వేల నుంచి రూ.40వేల వరకు వేతనం ఉంటుందన్నారు. కార్యక్రమంలో జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి హరిక్రిష్ణ, డీఆర్‌డీఏ పీడీ నరసయ్య తదితరులు పాల్గొన్నారు.

ఓటరు జాబితాపై సమీక్ష

పుట్టపర్తి టౌన్, ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి): భారత ఎన్నిక కమిషన్ ఆదేశాల మేరకు తప్పులు లేని ఓటరు జాబితా తయారీకి రాజకీయ పార్టీల ప్రతినిధులు సహకరించాలని కలెక్టర్ టీఎస్ చేతన్ కోరారు. కలెక్టరేట్‌లో ఓటరు జాబితా మార్పులు, చేర్పులు, కొత్త ఓటరు నమోదు, తొలగింపు, పోలింగ్ కేంద్రాల పెంపు తదితర అంశాలపై గుర్తింపు పొందిన పార్టీల ప్రతినిధులతో శనివారం సమీక్ష నిర్వహించారు. పోలింగ్ శాతాన్ని పెంచేందుకు, 18 సంవత్సరాలు నిండినవారి పేర్లను ఓటరు జాబితాలో చేర్పించేందుకు సహకరించాలని కోరారు. సమావేశంలో డీఆర్వో విజయ సారథి, టీడీపీ ప్రతినిధి సామకోటి ఆదినారాయణ, జనసేన ప్రతినిధి అబ్దుల్‌ఖాదర్, బీజేపీ ప్రతినిధి రామాంజనేయులు, సీపీఎం ప్రతినిధి గంగాధర్, బీఎస్పీ ప్రతినిధి సుబ్బరాయుడు, వైసీపీ ప్రతినిధి రవినాయక్, కాంగ్రెస్ ప్రతినిధి కె. భరణి తదితరులు హాజరయ్యారు.

30లోపు ఈకేవైసీ తప్పనిసరి: జేసీ

రేషన్‌కార్డులోని లబ్ధిదారులదరూ ఈ నెల 30లోపు తప్పకుండా ఈకేవైసీ చేయించుకోవాలని జేసీ అభిషేక్‌కుమార్ శనివారం సూచించారు. జిల్లాలో 16,89,531 రేషన్ కార్డుల లబ్ధిదారులు ఉన్నారని, ఇప్పటివరకు 15,48,523 మంది ఈకేవైసీ చేయించుకున్నారని తెలిపారు. మరో 1,11,673 మంది ఈకేవైసీ చేయించుకోవాల్సి ఉందని అన్నారు. లబ్ధిదారులందరూ రేషన్ దుకాణాలు, సచివాలయాలు, మీసేవ కేంద్రాల్లో ఈకేవైసీ చేయించుకోవాలని సూచించారు. లేకపోతే వారి పేర్లను రేషన్ కార్డుల నుంచి తొలగిస్తామని తెలిపారు. 5 సంవత్సరాలు పైబడి 80 సంవత్సరాల లోపు ఉన్న ప్రతి లబ్ధిదారుడు ఈకేవైసీ చేయించుకోవాలని సూచించారు.

'సక్షం'తో అంగన్‌వాడీలకు మహర్దశ
చిన్నారులకు ఆటపాటలతో విద్య

గర్భిణులు, బాలింతలకు నాణ్యమైన భోజనం
సుపోషిత్ గ్రామంగా కోటపల్లి ఎంపిక

సక్షం కార్యక్రమంతో అంగన్‌వాడీ కేంద్రాలకు మహర్దశ పట్టింది. ఈ కార్యక్రమం ద్వారా గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాల్లో మంచి వసతులు, పౌష్టికాహారం అందిస్తుండటంతో ఇక్కడికి వచ్చే పిల్లలు, గర్భవతులు, బాలింతలు, కిషోర బాలికల సంఖ్య పెరుగుతోంది. సక్షం(సివిలేటివ్ అడ్వాన్సుడ్ నాల్జెడ్ సస్టైనబుల్ హెల్త్ మేనేజ్‌మెంట్) కార్యక్రమం కింద మండలంలోని మల్లిరెడ్డిపల్లి, పెద్దపల్లి, గుర్రంబైలు, బాబేనాయక్‌తండా, కోటపల్లి, రత్నానాయక్ తండా, బాలసముద్రం, గందోడివారిపల్లి అంగన్‌వాడీ కేంద్రాలను ఎంపిక చేశారు. నల్లచెరువు ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని గాండ్లపెంట, నల్లచెరువు, తనకల్లు మండలాల్లో 23 కేంద్రాల్లో సక్షం కార్యక్రమం అమలు చేస్తున్నారు.


అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారుల ఆటను పర్యవేక్షిస్తున్న సూపర్‌వైజర్

ప్రగతే సక్షం

చిన్నారులకు పౌష్టికాహారం అందజేస్తున్న దృశ్యం


తనకల్లు ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి): సక్షం కార్యక్రమం కింద ఎంపికైన ఈ కేంద్రాల్లో పురుగు మందులు లేని కూరగాయలు, ఆకుకూరలను స్వయంగా అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలే పండించి గర్భవతులు, బాలింతలు, చిన్నారులకు అందిస్తున్నారు. ఈకేంద్రాలకు ప్రభుత్వం ఆట వస్తువులు మ్యాట్లు, బల్లలు, కుర్చీలు, నీటిట్యాంక్‌లు మంజూరు చేసింది. ఆడుకోవడానికి ఆహ్లాదకర వాతావరణం ఏర్పాటు చేశారు. ఆటపాటలతోనే ఈకేంద్రాల్లో విద్యను నేర్పుతున్నారు. ప్రైవేటు పాఠశాలలకు దీటుగా ఈకేంద్రాలను అభివృద్ధి పథంతో నడిపిస్తున్నారు. మరుగుదొడ్లు, తాగునీరు, పరిశుభ్రమైన వాతావరణం కల్పిస్తున్నారు. ఈనేపథ్యంలో సక్షం అంగన్‌వాడీ కేంద్రాల పట్ల చిన్నారులు బాగా ఆకర్షితులవుతున్నారు. చిన్నారుల సంఖ్యకూడా పెరుగుతోంది. తనకల్లు మండలంలోని కోటపల్లిని సుపోషిత పంచాయతీగా ఎంపిక చేశారు. ఎంపికైన గ్రామాల్లో తల్లీబిడ్డల ఆరోగ్య పరిరక్షణ, వివిధ శాఖల సమన్వయంతో వందశాత సేవలందిస్తూ, సమగ్రాభివృద్ధికి కృషి చేస్తున్నారు. పరిశుభ్రమైన వాతావరణం, మరుగుదొడ్లు, తాగునీటి వసతి తదితర అంశాలపై ప్రభుత్వం సర్వే నిర్వహించి ఆగ్రామాలకు అవార్డు(సుపోషిత్)లు ఇవ్వనున్నారు. ఇలా కోటపల్లి అంగన్‌వాడీ కేంద్రాన్ని ఎంపిక చేసినట్లు అధికారులు తెలిపారు. త్వరలోనే కేంద్ర, రాష్ట్రబృందాలు ఈగ్రామంలో పర్యటించనున్నట్లు సమాచారం.

చిన్నారుల్లో ఆసక్తి పెరిగింది


అంగన్‌వాడీ కేంద్రాల్లో ఆటవస్తువులు, ఆటపాటలతో చదువును చెబుతున్నారు. దీంతో కేంద్రాల పట్ల చిన్నారులకు ఆసక్తి పెరిగింది. గతంలో అంగన్‌వాడీ కేంద్రాలకు వెళ్లమని ఏడుస్తూ మొండికేసే చిన్నారులు కూడా ఆనందంగా గత్తులేస్తూ కేంద్రాలకు వెళ్తున్నారు.

- కావేరి, కోటపల్లి

బాధ్యత పెరిగింది


సక్షం కార్యక్రమం కింద మా కేంద్రాలు ఎంపిక కావడంతో మాపై మరింత బాధ్యత పెరిగింది. సక్షం కార్యక్రమం కింద పెరటి తోటల్లో పురుగు మందులు లేని ఆకుకూరలు, కూరగాయాలు పండించి , వాటితో తయారు చేసిన ఆహార పదార్థాలను బాలింతలు, గర్భవతులు, చిన్నారులకు, కిషోర బాలికలకు అందిస్తున్నాం. ఆటవస్తువులు, వాటర్ ప్లాంట్లు, మ్యాట్లు రావడం వల్ల పిల్లలకు కేంద్రాల పట్ల ఆసక్తి పెరిగింది.

- సాయిలక్ష్మి, అంగన్‌వాడీ కార్యకర్త, కోటపల్లి



చిన్నారుల ఎదుగులకు తోడ్పాటు

అంగన్‌వాడీకేంద్రాల్లో అందిస్తున్న పౌష్టికాహారం చిన్నారుల ఎదుగుదలకు తోడ్పడుతోంది. కేంద్రాల్లో రుచికరమైన భోజనం అందించడంతో పాటు ఆటపాటలతో విద్యను చెప్పడం వల్ల చిన్నారులు ఆనందంగా కేంద్రాలకు వెళ్తున్నారు. కేంద్రాల పట్ల తల్లులు, చిన్నారులు, గర్భవతులకు కూడా మక్కువ ఏర్పడింది.

- భార్గవి, మల్లిరెడ్డిపల్లి



సుపోషిత్‌కు ఎంపిక కావడం సంతోషకరం

నల్లచెరువు ప్రాజెక్టు పరిధిలోని తనకల్లు మండలంలోని కోటపల్లి పంచాయతీలో మూడు అంగన్‌వాడీ కేంద్రాలు సుపోషిత్ పరిధిలోకి రాష్ట్రస్థాయిలో ఎంపిక కావడం ఆనందం ఉంది. సక్షం కార్యక్రమం ద్వారా అంగన్‌వాడీకేంద్రాలకు మహర్దశ పట్టింది. ప్రైవేటు పాఠశాలలకు దీటుగా వీటిని అభివృద్ధి చేస్తున్నాం. ఆటపాటలతో విద్యను నేర్పుతూ పిల్లల వికాసానికి కృషి చేస్తున్నాం. భవిష్యత్‌లో మరిన్ని గ్రామాలు రాష్ట్రస్థాయికి ఎంపికయ్యేలా పనులను పర్యవేక్షిస్తున్నాం.

- జయంతి, సీడీపీఓ, నల్లచెరువు

సమస్యలను పరిష్కరించాలి
సీహెచ్ఓ సంఘం జిల్లా అధ్యక్షుడు కార్తీక్‌రెడ్డి


డీఎంహెచ్ఓ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న సీహెచ్ఓలు

పుట్టపర్తి రూరల్, ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి): వైద్య ఆరోగ్యశాఖ నేషనల్ హెల్త్ మిషన్ కింద విధులు నిర్వహిస్తున్న సీహెచ్ఓల సమస్యలను వెంటనే పరిష్కరించాలని సీహెచ్ఓ సంఘం జిల్లా అధ్యక్షుడు కార్తీక్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఏపీ ఎంపీసీఏ ఆధ్వర్యంలో డీఎంహెచ్ఓ కార్యాలయం వద్ద శనివారం ఆందోళనకు దిగారు. రెండు సంవత్సరాలుగా జీతభత్యాల విషయంలో తీవ్ర సమస్యలు ఎదుర్కొంటున్నామని అన్నారు. ఆరేళ్లు దాటిన సీహెచ్ఓల ఉద్యోగాలను క్రమబద్ధీకరించాలని కోరారు. నేషనల్ హెల్త్ స్కీంలోని ఇతర ఉద్యోగులతో పాటు 23 శాతం ఇంక్రిమెంట్ ఇవ్వాలని, ప్రతి నెలా జీతంతో పాటు ఇన్సెంటివ్ ఇవ్వాలని కోరాఉ. ఏటా 5 శాతం ఇంక్రిమెంటు ఇవ్వాలని, నేషనల్ హెల్త్ మిషనల్ నామ్స్ ప్రకారం రెగ్యులర్ చేసి, పెండింగ్ బిల్లులను వెంటనే చెల్లించాలని కోరారు. ఆర్థిక, ఆర్థికేతర సమస్యల పరిష్కారానికి హామీ ఇవ్వాలని జిల్లా ప్రధాన కార్యదర్శి నందీశ్వర్ డిమాండ్ చేశారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని డీఎంహెచ్ఓ ఫైరోజ్ బేగంకు అందజేశారు. కార్యక్రమంలో ఏపీఎంసీఏ సభ్యులు చందన, వేణుగోపాల్, సీహెచ్ఓలు పాల్గొన్నారు.


ట్రాక్టర్ చక్రం కింద ప్రాణాలు విడిచిన మంజునాథ్

అయ్యో.. ఇంత ఘోరమా..!

అమరాపురం, ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి): వక్క తోటలో రొటావేటర్‌తో దున్నుతున్న సమయంలో పట్టుతప్పి కిందపడి ట్రాక్టర్ డ్రైవర్ మంజునాథ్(31) ప్రాణాలు కోల్పోయాడు. ఈ విషాద ఘటన అమరాపురం మండల పరిధిలోని కాచికుంట గ్రామంలో శనివారం జరిగింది. అదే గ్రామానికి చెందిన అంగడి వీరన్న పొలంలో పనులకు మంజునాథ్ వెళ్లాడు. కుదుపుల కారణంగా పట్టుతప్పి కిందపడ్డాడు. ట్రాక్టర్ చక్రం అతనిమీద ఎక్కడంతో విలవిలలాడుతూ ప్రాణాలు విడిచాడు. ఆ దృశ్యాన్ని చూసి కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరయ్యారు. 'అయ్యో మంజునాథా.. ఎంత ఘోరం జరిగిందయ్యా..' అంటూ అక్కడికి వచ్చినవారు కంటతడి పెట్టుకున్నారు. ఎస్ఐ ఇషాంత్ బాషా ప్రమాద స్థలాన్ని పరిశీలించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని మడకశిర ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

గూడు చెదిరిన గువ్వలు

వివరాలు 6లో..

ఏడాదికోసారి



శ్రీరాముడి చిత్రపటంతో ఊరేగింపుగా గంపలు ఎత్తుకుని వనంలోకి వెళ్తున్న గ్రామస్థులు, వనంలో వంట చేస్తున్న మహిళలు

ఊరందరిది ఒకటే మాట.. అదే సంప్రదాయంగా వస్తున్న శ్రీరాముడి బాట. తెలతెలవారుతుండగానే పిల్లాపాపలు, ఇతర కుటుంబ సభ్యులతో కలిసి, కావాల్సిన పదార్థాలను గంపకెత్తుకుని, ఊరి నుంచి సమీప వనంలోకి వెళ్తారు. అక్కడే చెట్ల కింద వంటలు వండుకుని ఆనందంగా ఆరగిస్తారు. పగలంతా ఆటపాటలతో పిల్లలు, పెద్దలు సంతోషంగా గడుపుతారు. సాయం సంధ్య వేళలో మళ్లీ గ్రామంలోని రాముడి గుడి వద్దకు గంపతో వచ్చి, టెంకాయ కొట్టి పూజ చేస్తారు. అనంతరం ఎలవ గంపలతో ఎవరి ఇంటికి వారు వెళ్తారు. ఇలా ఊరంతా ఒకే మాటగా ప్రతి ఏడాది శ్రీరామనవమి పండుగ అనంతరం వన భోజనం నిర్వహించడం రూరల్ మండలంలోని చిగిచెర్లలో ఆనవాయితీగా వస్తోంది. ఎప్పటిలాగే ఈ ఏడాది కూడా శనివారం అందరూ వనం బాట పట్టారు. ఉదయాన్నే గ్రామస్థులంతా గ్రామాన్ని వదిలి శ్రీరాముని చిత్రపటం ఊరేగిస్తూ పిండివంటల సరుకులను గంపలో ఎత్తుకుని వనంలోకి వెళ్లారు. వనంలో యువతులు, మహిళలు ఊయ్యాలలు ఊగుతూ సంబరంగా గడిపారు. యువకులు కేరింతలతో ఉత్సాహంగా గ్రామీణ క్రీడలతో అలరింపజేశారు. అనంతరం సాయంత్రం వేళలో శ్రీరాముడి పటంతో ఊరేగింపుగా గ్రామంలోకి వెళ్లారు.

- ధర్మవరం రూరల్, ఆంధ్రజ్యోతి,

నేడు డీఎస్సీ నోటిఫికేషన్.. ఖాళీలు 911

అనంతపురం విద్య, ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి): డీఎస్సీ నోటిఫికేషన్ జారీకి అనుమతిస్తూ పాఠశాల విద్యాశాఖ ఉత్తర్వులు జారీచేసింది. దీనికి అనుగుణంగా ఆదివారం ఉదయం నోటిఫికేషన్ జారీ అవుతుంది. ఉమ్మడి జిల్లాలో పాఠశాల విద్యాశాఖ పరిధిలో 807, ట్రైబల్ వెల్ఫేర్ ఆశ్రమ్ పరిధిలో నాలుగు ఖాళీలు ఉన్నాయి. మొత్తంగా 811 పోస్టులను డీఎస్సీ ద్వారా భర్తీ చేయనున్నారు. పోస్టుల వారిగా స్కూల్ అసిస్టెంట్ లాంగ్వేజ్-1లో 37 ఖాళీలు, హిందీ 28, ఇంగ్లిష్ 103, గణితం 43, ఫిజికల్ సైన్స్ 66, జీవశాస్త్రం 72, సోషల్ 111, ఫిజికల్ ఎడ్యుకేషన్ 145, ఎస్జీటీలు 202 ఖాళీలు ఉన్నాయి. ట్రైబల్ వెల్ఫేర్ ఆశ్రమ్ పరిధిలో ఫిజికల్ సైన్స్-1 జీవశాస్త్రం -1 ఎస్జీటీలు-2 ఖాళీలు ఉన్నాయి.

సాంకేతిక విద్యాదీప్తి జేఎన్టీయూ


ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ చెన్నారెడ్డి
అట్టహాసంగా కాలేజీ డే.. స్పోర్ట్స్ డే
7

అవినీతికో రేటు..!

- సామాజిక తనిఖీల్లో అధికారుల చేతివాటం
- ప్రతి సోషల్ ఆడిట్‌కు రూ.30 వేలకుపైగా వసూలు
- నిధుల దుర్వినియోగ శాతం ఆధారంగా మరింత
- కీలకంగా వ్యవహరిస్తున్న ఇద్దరు అధికారులు
- డ్వామా విజిలెన్స్ విభాగంలో అక్రమాల తతంగం


ఖాళీగా దర్శనమిస్తున్న విజిలెన్స్ విభాగం

అనంతపురం క్లాక్‌టవర్, ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి): డ్వామాలో వసూలు చేసుకున్న వారికి వసూలు చేసుకున్నంతా అన్నట్లుగా ఉంది పరిస్థితి. అధికారులపై అవినీతి ఆరోపణలు వస్తే వాటిని పట్టించుకోకుండా మరింత మంచి పోస్టింగ్‌తో పొరుగు జిల్లాలకు పంపుతున్నారు. ఇందుకు ఉదాహరణ గతంలో విజిలెన్స్ విభాగంలో పనిచేసిన కీలక అధికారిపై అనేక అవినీతి, అక్రమాల ఆరోపణలు వచ్చాయి. అయితే ఆయనకు మరింత మంచి పోస్టింగ్ ఇచ్చి పొరుగు జిల్లాకు బదిలీపై పంపారు. ఆయన తరువాత ఇన్‌చార్జ్‌గా ఓ అధికారికి బాధ్యతలు అప్పగించారు. అయితే ఆయన్ను ఉత్సవ విగ్రహం చేసి డ్వామా పీడీ తరువాత స్థాయి అధికారి, హెచ్‌ఆర్ విభాగంలో ఉండే అధికారి అనధికారికంగా పర్యవేక్షిస్తున్నారు. ఉపాధి పనులు, వాటర్ షెడ్ ఇతర డ్వామా పరిధిలో అమలు చేస్తున్న పథకాలలో జరిగిన అక్రమాలు, నిధుల దుర్వినియోగంపై నిర్వహించే సామాజిక తనిఖీలు ఈ ఇద్దరు అధికారులకు కాసుల వర్షం కురిపిస్తున్నాయి. ఎక్కడ సామాజిక తనిఖీ నిర్వహించినా రూ.30 వేల నుంచి రూ. 50వేలు వారికి ఆయా మండల అధికారులు కట్టాల్సిందే. లేదంటే సామాజిక తనిఖీలో తేల్చిన నిధుల దుర్వినియోగం, అక్రమాలపై ఒత్తిడి తీసుకువచ్చి చర్యలకు ఉపక్రమిస్తారు. దీంతో ఆయా మండల ఉపాధి అధికారులు, అక్కడ పని చేసే సిబ్బంది అందరూ తలో చేయి వేసి సామాజిక తనిఖీ వేదికకు టోకెన్ చెల్లించేస్తారు. ఇక అక్కడితో ఆగరు. దుర్వినియోగమైన నిధుల శాతం ఆధారంగా మరో దఫా పైకం ఇచ్చుకోవాల్సిందే. డ్వామాలో నిఘా, హెచ్ ఆర్ విభాగాలకు చెందిన ఈ ఇద్దరు కీలక అధికారులే అవినీతి, అక్రమాలు ప్రోత్సహిస్తూ అక్రమ వసూళ్లను వాటాలుగా పంచుకుంటున్నారనే విమర్శలు ఆశాఖలో గట్టిగా విని పి స్త న్నాంయి. తాజాగా బుక్క రాయసముద్రం, రాప్తాడు, యల్లనూరు మండలాల్లో జరిగిన సామాజిక తనిఖీల్లో డ్వామాలోని ఇదరు కీలక అధికారులకు రూ. లక్షలు ముట్టజెప్పినట్లు సోషల్ మీడియలో వైరల్ అయ్యింది. ఆయా క్లస్టర్ల ఏపీడీలు, ఆయా మండలాల ఏపీఓలు, ఈసీ, టీఏ, ఫీల్డ్ అసిస్టెంట్ల నుంచి వసూళ్లకు దిగినట్లు సమాచారం.

ఇద్దరిదే కీలక పాత్ర

ఉపాధి హామీ, వాటర్‌షెడ్ పథకాలలో నిధుల దుర్వినియోగానికి సంబంధించి రికవరీ చేయడానికి డ్వామాలో ప్రత్యేకంగా నిఘా, హెచ్‌ఆర్ విభాగాలు ఉన్నాయి. గతంలో హెచ్‌ఆర్ విభాగంలో పనిచేస్తూ అవినీతి, ఆరోపణలు ఎదుర్కొని బదిలీపై వెళ్లిన ఓ అధికారి తిరిగి అదే స్థానానికి వచ్చి మునుపటి హవా సాగిస్తున్నారు. ఇందుకు ఇద్దరు అధికారులు బాగా సహకరిస్తున్నట్లు సమాచారం. ఇందులో ఒకరు హెచ్‌ఆర్ విభాగం, మరొకరూ ద్వితీయ స్థాయి అధికారి కావడం గమనార్హం. విజిలెన్స్ విభాగంతో సంబంధం లేకపోయినా అన్నీ తానై సోషల్ ఆడిట్ ఓపెన్ ఫోరం సమావేశాలకు హాజరై ఆయా మండలాల్లో వచ్చినంత పిండుకుంటున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. డ్వామా నిఘా, హెచ్‌ఆర్ విభాగాలలో వసూళ్ల పర్వం సాగుతోందనేందుకు ఇటీవల ఆయా మండలాల్లో వసూళ్లే నిదర్శనం. నిఘా, హెచ్‌ఆర్‌లలో ప్రతి ఫైల్‌కు ఓ రేటు నడుస్తోందని ఆశాఖలో ఉద్యోగులే చర్చించుకుంటున్నారు.

17వ విడత సామాజిక తనిఖీలు పూర్తి

డ్వామా పరిధిలోని పథకాల్లో నిధుల దుర్వినియోగం, అక్రమాలపై విచారణ చేపట్టేందుకే సోషల్ ఆడిట్ నిర్వహిస్తున్నారు. ఇప్పటి వరకు 17విడతల సామాజిక తనిఖీలు పూర్తి కాగా, ప్రస్తుతం 18, 19వ విడతలు కొనసాగుతున్నాయి. అయితే ప్రభుత్వ సొమ్మును రికవరీ చేసి బాధ్యతగా వ్యవహరించాల్సిన నిఘా విభాగం అధికారులు తమ చేతివాటం ప్రదర్శిస్తూ అక్రమార్కులకు అండగా నిలుస్తున్నారు. విజిలెన్స్ విభాగంలో రూ.4కోట్లకు పైగా రికవరీ చేయాలని తేల్చారు. ఇప్పటి వరకు రూ.2 కోట్ల వరకు రికవరీ చేశారు. అయితే అక్రమాలకు పాల్పడిన ఉపాధి సిబ్బందిపై చర్యలు శూన్యం. ముడుపులు పుచ్చుకుని కేసులు మాఫీ చేశారనే విమర్శలు వినిపిస్తున్నాయి. గడిచిన ఆరు నెలల కాలంలో విజిలెన్స్‌కు సంబంధం లేని అధికారి అన్నీ తానై మండల స్థాయిలో జరిగే సోషల్ ఆడిట్ ఓపెన్ ఫోరం సమావేశాలకు హాజరు కావడం...హెచ్‌ఆర్ విభాగంతో కలిసి ముడుపులలో వాటాలు పంచుకోవడం డ్వామాలో చర్చకు తెరలేపింది.


ఇటీవల యల్లనూరులో నిర్వహించిన సామాజిక తనిఖీలో పాల్గొన్న డ్వామా అధికారులు

పారదర్శకంగా నిర్వహిస్తున్నాం

సామాజిక తనిఖీలు పారదర్శకంగా నిర్వహిస్తున్నాం. ఇందులో ఎటువంటి సందేహాలు, సమస్యలు ఉన్నా నేరుగా నా దృష్టికి తేవచ్చు. ఎక్కడా ఒక్క పైసా కూడా ఆర్థికంగా లావాదేవీలు ఇందులో ఉండవు. ఇటువంటి వాటిని ఎవరూ ప్రోత్సాహించరు. సామాజిక తనిఖీల్లో తేల్చిన మొత్తాన్ని బాధ్యులు నుంచి రికవరీ చేయడంతో పాటు శాఖాపరమైన చర్యలు కూడా తీసుకుంటాం. క్లస్టర్లు, మండలాల వారిగా రికవరీపై ప్రత్యేక దృష్టి పెడుతున్నాం. విజిలెన్స్ విభాగం నుంచి నిత్యం నిఘా ఉంటుంది.

-సలీంబాషా, డ్వామా పీడీ

నీరసించిన కాంట్రాక్టర్లు

- పల్లె పండుగ పనులకు
- మలి విడత నిధులు ఏవీ?
- పనులు చేసిన కాంట్రాక్టర్లలో ఆందోళన
- పర్సెంటేజీలు తీసుకున్న అధికారుల్లో గుబులు


పంచాయతీరాజ్ శాఖ ఎస్ఈ కార్యాలయం

అనంతపురం న్యూటౌన్ ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం నిధులు విడుదల చేయకపోవడంతో పల్లె రోడ్ల పనులు చేసిన కాంట్రాక్టర్లు ఆందోళన చెందుతున్నారు. వైసీపీ ఐదేళ్ల పాలనలో రోడ్ల గురించి అసలు పట్టించుకోలేదు. దీంతో పల్లె ప్రజలు గుంతల రోడ్లపై ప్రయాణించడానికి తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఈనేపథ్యంలో టీడీపీ నేతృత్వంలో ప్రభుత్వం కొలువుదీరగానే పల్లె పండుగ పేరుతో గుంతల రోడ్లకు మోక్షం కల్గించేలా మరమ్మతులకు శ్రీకారం చుట్టింది. అలాగే అత్యవసరంగా నిర్మించాల్సిన చిన్నచిన్న రోడ్లను సైతం పూర్తి చేసేలా తగిన ప్రణాళిక తయారు చేయించింది. అందుకు అనుగుణంగా నిధులు కూడా విడుదల చేసింది. దీంతో కాంట్రాక్టర్లలో కొత్త ఉత్సాహం వచ్చింది. నిధుల కేటాయింపుతో అభివృద్ధి పనుల్లో వేగం పుంజుకుంది. పల్లె పండుగ పనులతో పాటు మరిన్ని పనులకు రాష్ట్ర ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. పనులు పూర్తికాకనే నిధులు కేటాయించడంతో ఇక బిల్లుల చెల్లింపులకు డోకా ఉండదని కాంట్రాక్టర్లు సంబరపడ్డారు. పనుల్లో వేగం పెంచి, త్వరగా పూర్తయ్యేలా చర్యలు చేపట్టారు. ఈక్రమంలో కొందరు అధికారులకు సైతం అడ్వాన్సుగా పర్సెంటేజీలు ఇచ్చేసినట్లు సమాచారం. ఇందులో ఓ ఉన్నతాధికారి తనకు రావాల్సిన పర్సెంటేజీలు ముట్టడంతో ఫుల్ జోష్‌లో ఉన్నారన్న చర్చ జరుగుతోంది.

స్పీడ్‌కు బ్రేక్

ప్రభుత్వం మరోసారి నిధుల విడుదలకు సంబంధించి ఎలాంటి ముందడుగు లేకపోవడంతో కాంట్రాక్టర్ స్పీడ్‌కు బ్రేక్ పడింది. ఇప్పటికే పూర్తిస్థాయిలో పర్సెంటేజీలు పుచ్చుకున్న అధికారుల్లో సైతం గుబులు మొదలైందన్న చర్చ జరుగుతోంది. కాంట్రాక్టర్ల కంట పడితే ఏమి అడుగుతారో.. ఏమి సమాధానం చెప్పాలో అర్థం కాక అధికారులు మొహం చాటేస్తున్న పరిస్థితి. కొద్ది రోజులు ఇలాగే కొనసాగితే.. కొంత మంది కాంట్రాక్టర్లు బిల్లులు అయిన తరువాత మీ పర్సెంటేజీ సొమ్ము మీకు ఇస్తాం.. ప్రస్తుతానికి మేము ఇచ్చిన సొమ్ము మాకివ్వండి అనే పరిస్థితి వచ్చే అవకాశం ఉందన్న చర్చ జరుగుతోంది.

మంజూరైన సిమెంట్ రోడ్లను పరిశీలిస్తే..

జిల్లా వ్యాప్తంగా 1961 పనులకు అనుమతులు మంజూరయ్యాయి. రూ.105.05కోట్లతో 217.18 కిలోమీటర్ల పొడవు రోడ్డు పనులకు శ్రీకారం చుట్టారు. అనుమతించిన పనుల్లో ఇప్పటికే 1750 పూర్తి అయినట్లు అధికార వర్గాలు చెబుతున్నాయి. దీంతో 198 కిలోమీటర్ల పొడవున పనులు పూర్తి చేశారు. 15 పనులకు సంబంధించి కొత్తగా అనుమతులు మంజూరయ్యాయి. ఇవికాకుండా మొత్తం రూ.90 కోట్ల పనులకు జిల్లాలో శ్రీకారం చుట్టారు. వీటికి సంబంధించి రూ.24.88 కోట్ల నిధులు మంజూరయ్యాయి. రూ.80 కోట్ల వరకు కేవలం సీసీ రోడ్లకు సంబంధించి నిధులు విడుదల కావాల్సి ఉంది.

తారు రోడ్లను పరిశీలిస్తే..

జిల్లాలో మొత్తం 18 రోడ్ల నిర్మాణానికి అనుమతులు మంజూరయ్యాయి. రూ.30.19 కోట్లు కేటాయించారు. ఇందులో 10.39 కిలోమీటర్ల పనులు పూర్తయ్యాయి. వీటికి సంబంధించి 4.86 కోట్ల నిధులు విడుదల చేశారు. 17.6 కిలోమీటర్లకు సంబంధించి నూతనంగా అనుమతులు మంజూరయ్యాయి. పనులు ప్రారంభ దశలో ఉన్నాయి.


నిర్మాణ దశలో ఉన్న రోడ్డు

కల సాకారం!

- వేదవతి హగరిపై బ్రిడ్జి నిర్మాణానికి శ్రీకారం
- రూ.48 కోట్లతో పనులు ప్రారంభం
- కణేకల్లు-ఉరవకొండ ప్రజలకు తప్పనున్న బాధలు
- దశాబ్దాల నాటి సమస్యకు పరిష్కారం


బ్రిడ్జి పనులకు శంకుస్థాపన చేస్తున్న విప్ కాలవ శ్రీనివాసులు (ఫైల్)


నూతన బ్రిడ్జి ఏర్పాటుకు సిద్ధం అవుతున్న స్థలం

కణేకల్లు, ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి): మండల ప్రజల నాలుగు దశాబ్దాల కల నెరవేరనుంది. మండల కేంద్రం నుంచి ఉరవకొండకు వెళ్ల దారిలో వేదవతి హగరిపై బ్రిడ్జి ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. అంతేగాక రూ.48.42 కోట్లను మంజూరు చేసింది. దీంతో పనులకు ఏర్పాట్లు జరుగుతున్నాయి.

పయ్యావుల, కాలవ సమన్వయంతో..

టీడీపీ నేతృత్వంలో ప్రభుత్వం ఏర్పడగానే ఇక్కడ బ్రిడ్జి ఏర్పాటుపై ఉరవకొండ, రాయదుర్గం నియోజకవర్గాల ఎమ్మెల్యేలు ప్రత్యేక దృష్టి సారించారు. ఉరవకొండ ఎమ్మెల్యే పయ్యావుల కేశవ్ ఆర్థికమంత్రిగా ఉండగా, రాయదుర్గం ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు విప్‌గా ఉండటంతో వీరిద్దరి సమన్వయంతో బ్రిడ్జి ఏర్పాటుకు రూ.48.42 కోట్లు నిధులు మంజూరయ్యాయి. ఇప్పటికే టెండర్ల ప్రక్రియ పూర్తికాగా శ్రీసాయి కన్‌స్ట్రక్షన్ పనులను దక్కించుకుంది. గత ఏడాది అక్టోబరు 12న విప్ కాలవ శ్రీనివాసులు బ్రిడ్జి నిర్మాణ పనులకు భూమి పూజ చేశారు.

శిథిలావస్థలో హెచ్చెల్సీ అక్విడెక్ట్


శిథిలావస్థకు హెచ్చెల్సీ అక్విడెక్ట్

స్థానిక వేదవతి హగరిపై 1984లో హెచ్చెల్సీ అక్విడెక్ట్‌ను నిర్మించారు. దీనిపై కణేకల్లు-ఉరవకొండ మధ్య వాహనాల రాకపోకలు సాగుతుండేవి. మూడేళ్ల కిందట అక్విడెక్ట్ శిథిలావస్థకు చేరుకుందని హెచ్చెల్సీ అధికారులు రహదారిని మూసివేశారు. దీంతో ప్రయాణికులు దిగువగేరు మీదుగా ఉన్న హగరిలో కొన్ని రోజులు ఆటోలలో రాకపోకలు సాగించారు. కానీ వర్షం వచ్చినపుడు ఆ దారి కూడా కొట్టుకుపోయింది. దీంతో హెచ్చెల్సీ అక్విడెక్ట్‌పైనే ఆటోలకు మాత్రమే అనుమతులు ఇచ్చి బస్సుల రాకపోకలను పూర్తిగా నిలిపివేశారు. దీంతో కణేకల్లుతో పాటు మాల్యం, కళేకుర్తి, సొల్లాపురం, హనుమాపురం, తుంబిగనూరు, గరుడచేడు తదితర గ్రామాలకు వెళ్లాలంటే అనేక అగచాట్లు పడాల్సి వచ్చింది.

సమస్యపై దృష్టి సారించిన ప్రభుత్వం

కణేకల్లు- ఉరవకొండకు రోడ్డు సమస్యపై ప్రజాప్రతినిధులకు పలు సార్లు స్థానికులు వినతిపత్రాలు ఇచ్చి, బ్రిడ్జి అవసరాన్ని వివరించారు. ఉరవకొండ, రాయదుర్గం నియోజకవర్గాల ఎమ్మెల్యేలు ముఖ్యమంత్రితో చర్చించి బ్రిడ్జికి నిధులు మంజూరు చేయాలని కోరారు. దీంతో రాష్ట్ర చీఫ్ ఇంజనీర్ ఈ ప్రాంతాన్ని పరిశీలించారు. అనంతరం ఆర్‌అండ్‌బీ శాఖ ద్వారా ఎన్‌డీపీ స్కీం కింద నిధులు మంజూరయ్యాయి. 1.9 కి.మీ. ఈ రహదారిలో 480 మీటర్లు బ్రిడ్జి కాగా మిగతాది స్థానిక అయ్యప్పస్వామి గుడి నుంచి కళేకుర్తి రహదారి వరకు డబుల్ రోడ్‌గా ఉంది. వేదవతి హగరిపై నిర్మించనున్న 480 మీటర్ల బ్రిడ్జి పొడవులో ఏడు మీటర్ల వెడల్పు ఉంటుందని అధికారులు పేర్కొన్నారు. ఇప్పటికే పనుల ప్రక్రియ ప్రారంభం కాగా ఈ ప్రాంతంలోని శ్రీరామిరెడ్డి పైప్‌లైన్ అడ్డుగా ఉండడంతో దాన్ని షిఫ్టింగ్ చేసేందుకు కాంట్రాక్టర్లు అధికా రులకు ప్రతిపాదనలు పెట్టారు. అది పూర్తవ్వగానే పనుల వేగవంతం చేయనున్నట్లు ఆర్‌అండ్‌బీ అధికారులు పేర్కొన్నారు.

మా గ్రామం కనుమరుగయ్యేది



రాష్ట్ర ప్రభుత్వం బ్రిడ్జి నిర్మాణానికి పూనుకోకపోతే మాగ్రామం కనుమరుగయ్యేది. ఎందుకంటే ఇప్పటికే ఈ ప్రాంతంలో బస్సుల రాకపోకలు లేక కళేకుర్తి రవాణా సౌకర్యానికి దూరంగా ఉంది. బస్సులన్నీ కణేకల్లులోని దిగువగేరి నుంచి మాల్యం మీదుగా వెళుతున్నాయి. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

- మల్లి, మాజీ సర్పంచ్, కళేకుర్తి

పైప్‌లైన్ షిఫ్టింగ్ పూర్తి కాగానే..



కళేకుర్తి వద్ద నిర్మించనున్న బ్రిడ్జి కింది భాగంలో శ్రీరామిరెడ్డి పైప్ లైన్ ఉంది. ఇటీవల పనులు చేసేటపుడు పైపులైన్ అడ్డంకిగా మారడంతో దాన్ని పూర్తిగా ఇతర చోటికి షిఫ్టింగ్ చేయాలని నిర్ణయించాం. ఇందు కోసం రూ.రెండు కోట్లు ఆర్ అండ్‌బీ ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపాం. అలాగే ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులు కూడా షిఫ్టింగ్‌కు ప్రయత్నాలు చేస్తున్నారు. పైప్‌లైన్ షిఫ్టింగ్ పూర్తి అయిన వెంటనే బ్రిడ్జి పనులు వేగవంతం చేసి ప్రజలకు అందుబాటులోకి తెస్తాం.

-రవిశంకర్‌రెడ్డి, డీఈ, ఆర్‌అండ్‌బీ, రాయదుర్గం

విద్యార్థులకు అనుకూలం

మా గ్రామం నుంచి ప్రతి రోజూ దాదాపు వంద మంది విద్యార్థులు పాఠశాల, కళాశాలకు వెళ్తుంటారు. ఐదు కి.మీ. దూరం కణేకల్లుకు ప్రయాణించాలంటే గతంలో ఎలాంటి సౌకర్యాలు ఉండేవి కావు. బ్రిడ్జి ఏర్పాటైతే బస్సులన్నీ మా ఊరి మీదుగానే వెళతాయి. దీంతో విద్యార్థులకు కూడా బస్సు సౌకర్యం ఉండటంతో పాటు రవాణా సౌకర్యాలు కూడా మెరుగుపడతాయి. అలాగే ప్రజలు కూడా ఇబ్బంది పడకుండా ఉంటారు.

-మారెన్న, కళేకుర్తి

గూడు చెదిరిన గువ్వలు..!



అదిగదిగో... అక్కడ..
పచ్చరంగులో కనిపిస్తోందే అదే చిలుక..
ఇదిగో.. ఇక్కడ..
తెల్లగా
కనిపిస్తోందే
అది కొంగ
ఇటు
చూడూ..
ఆ కొమ్మపై
కూర్చుని కుహు
కుహూ
అంటోందే నల్ల పక్షి అదే కోయిల
ఇలా.. కొన్నేళ్ల కిందట పల్లెల్లో పసి
పిల్లలకు పెద్దలు చెప్పేవారు.
చెరువులు, కుంటలు, వాగులు, వంకల
వద్ద చెట్ల కొమ్మలపై చేరి ఉదయం,
సాయం సంధ్య వేళల్లో ఆ పులుగులు
చేసే కిలకిలరావాలు ఎంతో
ఆహ్లాదంగా ఉండేది.
ఇదంతా గతం
ప్రపంచీకరణ, సాంకేతిక
పరిణామాలతో అనేక పక్షి జాతులు
అంతరించిపోతున్నాయి.
కిలకిలరావాలు మాయమైపోయాయి.
ప్రస్తుతం పిల్లలకు ఫలానా పక్షి ఎలా
ఉంటుందంటే కంప్యూటర్‌లోనో లేక
సెల్‌ఫోన్‌లోనో చూపించాల్సిన
పరిస్థితి ఏర్పడిందని పక్షి ప్రేమికులు
ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

- అంతరించిపోతున్న పక్షిజాతులు
- ఆందోళనలో పక్షి ప్రేమికులు
- అడవులు, చిరుధాన్యాలు తగ్గిపోవడమే కారణమా?
- పంటలకు పురుగుమందుల వాడకంతో మృత్యువాత

తనకల్లు, ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి): మూడు, నాలుగు దశాబ్దాల కిందట కనిపించిన అనేక పక్షి జాతులు నేడు అంతర్థానం అయ్యాయి. గ్రామాల్లో ఇబ్బడిముబ్బడిగా కనిపించే కాకులు, గద్దలు, పిచ్చుకలు, కొంగలు కూడా తగు స్థాయిలో కనిపించడం లేదు. ఇప్పుడిప్పుడే ప్రభుత్వాలు కూడా పక్షుల రక్షణ పట్ల తగు జాగ్రత్తలు తీసుకుంటున్నాయి.

ఈ నేపథ్యంలోనే మండలంలో పనిచేస్తున్న జనజాగృతి స్వచ్ఛంద సంస్థ వివిధ సంస్థలతో కలిసి పక్షి జాతుల లెక్కింపు సర్వే కార్యక్రమం చేపట్టింది. ఇందులో అనేక విషయాలు వెలుగుచూస్తున్నాయి. ఎన్నో రకాల పక్షి జాతులు అంతరించిపోతున్నట్లు సర్వేల ద్వారా తెలుస్తోంది. వేగంగా పెరుగుతున్న జనాభా కారణంగా గ్రామాల చుట్టూ ఉన్న కొండలు, గుట్టలు, వాగులు, వంకలు వ్యవసాయ భూములుగా మారిపో యాయి. విచ్చలవిడిగా రైతులు ఉపయోగిస్తున్న పురుగు మందులు కూడా పక్షి జాతులు అంతరించిపోవడానికి ప్రధాన కారణమని సంస్థ ప్రతినిధులు చెబుతున్నారు. పట్టణాలు ఊహించని రీతిలో అభివృద్ధి చెందుతున్నాయి. దీంతో పట్టణాల చుట్టూ ఉన్న పెద్ద వృక్షాలను సైతం తొలగిస్తున్నారు. రోడ్ల విస్తరణలో భాగంగా ఎన్నో ఏళ్లనాటి వృక్షాలు సైతం నేల కూలుస్తున్నారు. దీంతో గూడు చెదిరిన పక్షులు కాలక్రమేణ అంతరించిపోతున్నాయి.


సర్వే చేస్తున్న జనజాగృతి టీమ్

రసాయన ఎరువులతో చేటు

గ్రామాల్లో గతంలో నవధాన్యాలు, చిరు ధాన్యాలు సాగుచేసేవారు. పురుగుమందులు, రసాయనిక ఎరువులు వినియోగం ఉండేదికాదు. దీంతో పక్షి జాతులకు కావలసిన ఆహారం పుష్కలంగా పంట పొలాల్లో లభించేది. పురుగుమందులు వాడకపోవడంతో పక్షులకు కావలసిన పురుగులు లభించేవి. వంకలు, వాగులు, కుంటలు, చెరువుల్లో ఏడాది పొడవునా నీరుండేది. నీరు, ఆహారం పుష్కలంగా ఉండటం, భారీ వృక్షాల ఆవసంతో పక్షి సంతతి కూడా బాగా వృద్ధి చెందేది. ప్రస్తుతం వందలాది అడుగుల లోతు బోరుబావులు తవ్వుతున్నారు. దీంతో వంకలు, వాగులు, బావులు, కుంటల్లో సైతం వర్షం పడిన నెల, రెండు నెలల్లోపే నీరు ఇంకిపోతోంది. దీంతో పక్షి జాతులకు నీటి కరువు ఏర్పడుతోంది. వేసవిలో విచ్చలవిడిగా కొండలు, గుట్టలకు నిప్పు పెడుతుండటంతో అక్కడ కూడా రక్షణ లేక అనేక పక్షి జాతులు మృత్యువాత పడుతున్నాయి. ఇలాంటి అనేకానేక కారణాలతో పక్షి జాతులు అంతరించపోతున్నాయన్నది వాస్తవం. పక్షి జాతులను సంరక్షించకపోతే భవిష్యత్తులో అనేక సమస్యలు ఉత్పన్నమయ్యే ప్రమాదం ఉందని పక్షిప్రేమికులు, పర్యావరణ ప్రేమికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు స్పందించి గ్రామాలు, అడవుల్లో పక్షులు స్థావరాలు ఏర్పాటు చేసుకోవడానికి అనువైన ప్రాంతాల్లో ఎత్తైన మొక్కలు పెంచేలా చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉంది.


చిన్నరామన్నగారిపల్లి వద్ద అరుదైన బ్లాక్‌స్టోరక్ పక్షి



95శాతం పక్షులు.. పురుగులనే తింటాయి



95 శాతం పక్షులు పురుగులు తినే జీవిస్తాయి. 5శాతం పక్షులు మాత్రమే గింజలు, కాయలు తింటాయని పక్షుల పరిశోధకుడు, సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ అయిన అశోక్ తెలిపాడు. నల్లమాడకు చెందిన ఈయన బీటెక్ చదివి బెంగుళూరులో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తున్నాడు. ఓ వైపు ఉద్యోగం చేస్తూనే వారంలో రెండురోజులపాటు అడవుల్లో సంచరిస్తూ, వివిధ రకాల పక్షులను గుర్తిస్తున్నారు. ఇప్పటికే మన ప్రాంతంలో బట్టమేక పిట్ట, కలిమికోడి కనిపించడం లేదని వెల్లడించారు. ప్రభుత్వాలు వీటికోసం నిధులు ఖర్చు చేసి సంరక్షణ చర్యలు చేపట్టాల్సి ఉందని తెలిపారు. గత 20 సంవత్సరాలుగా మన ప్రాంతంలో కనిపించని బ్లాక్‌స్టోరక్ పక్షి ఇటీవల తనకల్లు మండలంలోని చిన్నరామన్నగారిపల్లి వద్ద కనిపించినట్లు పేర్కొన్నారు. ఇది అరుదైన పక్షి అని కాపాడుకోవాల్సి ఉందన్నారు.

-అశోక్, పక్షుల పరిశోధకుడు, నల్లమాడ

కాకులు, పిచ్చుకలు కూడా అంతరించిపోతున్నాయి



మాచిన్నప్పుడు గ్రామంలో ఏపుగా పెరిగిన చింత, వేపచెట్లు ఎక్కువగా ఉండేవి. చెట్ల నిండా కాకులు నివాసముండేవి. ప్రతి ఇంటిలోనా ఎక్కడో ఒకచోట పిచ్చుకుల స్థావరాలుండేవి. నేడు కొట్టాల స్థానంలో కాంక్రీటు మిద్దెలొచ్చాయి. గ్రామంలోని ఎత్తైన చెట్లను కొట్టేశారు. ఈకారణంగా పక్షులు ఆవాసాలు కోల్పోవడంతో అవి అంతరించిపోతున్నాయి. నేటి యువతకు పక్షి జాతుల పట్ల కనీస అవగాహన లేదు. పాఠ్యపుస్తకాల్లో పక్షి జాతుల గురించి తెలియజేయాల్సి ఉంది.

- రెడ్డిశేఖర్ రెడ్డి, మల్లిరెడ్డిపల్లి

ప్రజల్లో చైతన్యం తీసుకొస్తున్నాం



ప్రజల్లో పక్షులు, వన్యప్రాణుల పట్ల సంస్థ ద్వారా అవగాహన కల్పిస్తున్నాం. వాటికి కావలసిన స్థావరాల కోసం గ్రామాల వద్ద అడవుల్లో మొక్కల పెంపకం చేపడుతు న్నాం. పక్షి జాతులు లెక్కింపు కార్యక్రమాన్ని కొనసాగిస్తున్నాం. ఇప్పటివరకూ 208 పక్షి జాతులను గుర్తించాం. ఇంకా గుర్తించాల్సినవి ఉన్నాయి. ప్రభుత్వాలు కూడా పక్షి జాతుల అభివృద్ధి కోసం చర్యలు చేపట్టాల్సి ఉంది.



- రామ్ ప్రసాద్, సీఈఓ, జనజాగృతి

ఇద్దరు హౌసింగ్ ఇంజనీర్లపై బదిలీ వేటు

పలువురికి నోటీసులు

అనంతపురం క్లాక్‌టవర్, ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వంలో ఇళ్ల నిర్మాణంలో అక్రమాలకు పాల్పడి విచారణ ఎదుర్కొంటున్న ఇద్దరు ఇంజనీర్లపై బదిలీ వేటు పడింది. అలాగే పలువురికి నోటీసులు జారీ చేశారు. గత ప్రభుత్వంలో అనంతపురం అర్బన్‌లో డీఈగా ఉన్న కృష్ణారావు, పీడీ కార్యాలయంలో ఏఈగా ఉన్న వినోద్‌కుమార్ అక్రమాల ఆరోపణలు ఎదుర్కొంటున్నారు. విచారణ పెండింగ్‌లో ఉన్న డీఈ కృష్ణారావును కర్నూలుకి, ఏఈ వినోద్‌కుమార్‌ను చిత్తూరుకు బదిలీ చేస్తూ ఏపీ రాష్ట్ర గృహ నిర్మాణశాఖ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. గతంలో రాప్తాడు ఇన్‌చార్జి డీఈగా ఉన్న ప్రస్తుత బుక్కరాయసముద్రం ఏఈ, శింగనమల ఇన్‌చార్జి డీఈ దేవరకొండ రామమూర్తికి షోకాజ్ నోటీసులు జారీ చేశారు. ఉద్యోగ విరమణ పొందిన అప్పటి రాప్తాడు డీఈ మహబూబ్‌బాషాకు నోటీసులు ఇచ్చారు. అప్పట్లో రాప్తాడు నియోజకవర్గంలో ఏఈగా ఉన్న అనిల్‌కుమార్‌ను విధుల నుంచి పూర్తిగా తొలగించారు. పవన్‌కుమార్‌పై క్రిమినల్ కేసులు నమోదు చేశారు. అప్పటి ఆత్మకూరు ఏఈలుగా పనిచేసిన జమీల్, కొండాభూషణ్, శ్రీనివాసులుకు షోకాజ్ నోటీసులు జారీ చేశారు. గత వైసీపీ ప్రభుత్వంలో సుమారు రూ.రెండు కోట్లకు పైగా అవినీతి, అక్రమాలకు పాల్పడినట్లు ఇంజనీర్లపై విచారణ సాగుతోంది. విచారణ అనంతరం ఇంజనీర్లపై శాఖాపరమైన చర్యలు తీసుకోనున్నట్లు హౌసింగ్ పీడీ శైలజ తెలిపారు.

జాతీయ డ్రాగన్ బోటింగ్ పోటీలకు జిల్లా క్రీడాకారుడు



కోచ్ శేఖర్‌తో ధోనిసింగ్

అనంతపురం క్లాక్‌టవర్, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): డ్రాగన్ బోటింగ్ నేషనల్ పోటీలకు జిల్లాకు చెందిన క్రీడాకారుడు ఎంపికయ్యాడు. ఈనెల 24 నుంచి మధ్యప్రదేశ్‌లోని భోపాల్‌లో జరిగే 13వ డ్రాగన్ బోటింగ్ జూనియర్ నేషనల్ పోటీలకు నగరానికి చెందిన ధోనిసింగ్ ఎంపికయ్యాడు. ప్రస్తుతం కోచ్ శేఖర్ పర్యవేక్షణలో ధోనిసింగ్ కర్నూలులో బోటింగ్‌పై సాధన చేస్తున్నాడు. జాతీయ బోటింగ్ పోటీలకు ఎంపికైనందుకు ఎంకే స్పోర్ట్స్ అకాడమీ హెడ్‌కోచ్ రాహుల్ అభినందనలు తెలిపారు.

వేసవి శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

అనంతపురం క్లాక్‌టవర్, ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి): శాప్ ఆధ్వర్యంలో వేసవి శిక్షణ శిబిరాల నిర్వహణకు ఆసక్తి, అర్హత ఉన్న కోచ్‌ల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు డీఎస్‌డీఓ ఉదయ్‌భాస్కర్ తెలిపారు. 2025 సంవత్సరానికి గాను జిల్లాలో 50 వేసవి శిక్షణ శిబిరాలు మే 1 నుంచి 31వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆసక్తి గల క్రీడా శిక్షకులు, పీడీ, పీఈటీలు, సీనియర్ ప్లేయర్లు, కోచ్‌లు, సర్టిఫికెట్ కోర్సు చేసిన శిక్షకులు అర్హులని పేర్కొన్నారు. 8-14 సంవత్సరాల మధ్య వయస్సు గల పిల్లలను గుర్తించి క్రీడలపట్ల ఆసక్తి పెంచడానికి ప్రతిభావంతులైన క్రీడాకారులుగా తీర్చిదిద్దేందుకు కోచ్‌లు కృషి చేయాలని అన్నారు. అర్హతగల అభ్యర్థులు ఈనెల 21వతేదీ సాయంత్రంలోపు అశోక్‌నగర్, డీఎస్‌ఏ ఇండోర్ స్టేడియంలో దరఖాస్తులు అందజేయాలన్నారు. వివరాలకు 08554-315632ను సంప్రదించాలని తెలిపారు.

టార్గెట్ పూర్తి చేయాలి

జిల్లా వ్యవసాయ అధికారి ఉమామహేశ్వరమ్మ

అనంతపురం అర్బన్, ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి): యాంత్రీకరణ పథకానికి సంబంధించి ఈనెల 24లోగా ప్రభుత్వం ఇచ్చిన టార్గెట్‌ను పూర్తి చేయాలని జిల్లా వ్యవసాయ అధికారి ఉమామహేశ్వరమ్మ ఆదేశించారు. స్థానిక జేడీఏ కార్యాలయంలో శనివారం సాయంత్రం ఏడీఏలు, ఏఓలతో ఆమె సమావేశమయ్యారు. 2024-25 సంవత్సరానికి సంబంధించి యాంత్రీకణ పథకానికి రూ.3 కోట్లు టార్గెట్ ఇవ్వగా, ఇప్పటి దాకా రూ.1.07 కోట్లు పూర్తి చేసినట్లు తెలిపారు. మిగిలిన మొత్తాన్ని ఈనెల 24లోగా పూర్తి చేసేలా ప్రత్యేక చొరవ చూపాలన్నారు. ఈనెల 30లోగా తమ వాటా డబ్బులు చెల్లించిన రైతులకు యాంత్రీకరణ పరికరాలు సరఫరా చేయాలన్నారు. జిల్లాకు 35 డ్రోన్లు కేటాయించారని, ఇప్పటి దాకా 25 రైతు గ్రూపులు ఏర్పాటు చేసి, మంజూరు చేసినట్లు తెలిపారు. మిగిలిన గ్రూపులను త్వరగా ఏర్పాటు చేసి, డ్రోన్లు మంజూరు చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఖరీఫ్ సీజన్‌కు ముందు అన్ని రకాల ఎరువులు అందుబాటులో ఉండేలా చూడాలన్నారు. ఎమ్మార్పీకే ఎరువులు విక్రయించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఎక్కడైనా వేసవి కాలంలో పంటలు సాగు చేసి ఉంటే ఆయా పంటలకు ఈ క్రాప్ చేయాలన్నారు.

నేడు 'శ్రమకావ్యం' పుస్తక గానసభ

హాజరు కానున్న సుద్దాల అశోక్ తేజ

అనంతపురం కల్చరల్, ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి): ఐద్వా, సీఐటీయూ, ఎస్ఎఫ్ఐ, జేవీవీ, యూటీఎఫ్ సంఘాల సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం 5.30 గంటలకు జిల్లా కేంద్రంలోని జడ్పీ హాలులో 'శ్రమకావ్యం' పుస్తక గాన సభ నిర్వహించనున్నట్లు ఐద్వా రాష్ట్ర కోశాధికారి సావిత్రి పేర్కొన్నారు. శనివారం సీఐటీయూ జిల్లా కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ... సమాజ అభివృద్ధిలో శ్రమ మార్పు, ఆధునిక కాలంలో దాని గొప్పతనం, అసమానతలతో కూడిన నేటి సమాజం ఎలా మారుతుందో ప్రముఖ సినీ గేయ రచయిత సుద్దాల అశోక్ తేజ 'శ్రమకావ్యం' పుస్తకం రూపంలో వివరించారని అన్నారు. త్వరలో మేడే రానున్న నేపథ్యంలో ఆదివారం నిర్వహించనున్న పుస్తక గాన సభకు గేయ రచయిత సుద్దాల అశోక్ తేజ వస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో ఆర్వీ నాయుడు, తిరుపాలు, బాలరంగయ్య, వీరరాజు, పరమేష్, చంద్రిక, భీమేష్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఐద్వా రాష్ట్ర కోశాధికారి సావిత్రి



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ప్రిన్సిపాల్ చెన్నారెడ్డి, ప్రొఫెసర్లు



క్రీడా పోటీలలో సాధించిన ట్రోఫీలతో విజేతలు.. ప్రిన్సిపాల్ తదితరులు

సాంకేతిక విద్యాదీప్తి జేఎన్టీయూ

కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ చెన్నారెడ్డి

అట్టహాసంగా కాలేజీ డే.. స్పోర్ట్స్ డే

లేడీ జాక్సన్.. మూన్ వాక్



అనంతపురం సెంట్రల్, ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి): అనంతపురం జేఎన్టీయూ ఇంజనీరింగ్ కళాశాల 79 సంవత్సరాలుగా సాంకేతిక విద్యాదీప్తిగా వెలుగొందుతోందని ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ చెన్నారెడ్డి అన్నారు. వర్సిటీలోని ఎన్టీఆర్ ఆడిటోరియంలో శనివారం కాలేజీ డే.. స్పోర్ట్స్ డే నిర్వహించారు. వైస్ ప్రిన్సిపాల్ వసుంధర, సీనియర్ ప్రొఫెసర్ దేవన్న, ఇన్‌చార్జి ఫిజికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ జోజిరెడ్డితో కలిసి ఆయన వేడుకలను ప్రారంభించారు. జేఎన్టీయూలో చదివిన వేలాది మంది ప్రపంచ వ్యాప్తంగా వివిధ రంగాల్లో స్థిరపడ్డారని అన్నారు. శాస్త్రవేత్తలుగా, పారిశ్రామికవేత్తలుగా, ప్రభుత్వ ఉద్యోగులుగా సేవలు అందిస్తున్నారని అన్నారు. సివిల్, మెకానికల్, ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యునికేషన్, కంప్యూటర్ సైన్స్, కెమికల్ ఇంజనీరింగ్ కోర్సుల ద్వారా ప్రతి సంవత్సరం 400 మందికిపై బీటెక్ పట్టాలు పొందుతున్నారని వివరించారు. అధునాతన ల్యాబ్‌లు, లైబ్రేరీలు, అపార అనుభవం ఉన్న టీచింగ్ ఫ్యాకల్టీ తమ కళాశాల సొంతమని అన్నారు. ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకుని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని విద్యార్థులకు సూచించారు. అనంతరం విద్యార్థులకు సర్టిఫికెట్స్‌ను అందజేసి అభినందించారు. అనంతరం విద్యార్థులు సాంస్కృతిక ప్రదర్శనలతో అలరించారు.



సినిమా పాటకు స్టెప్పులు

ఉత్సాహంగా క్రీడాపోటీలు

టీచింగ్ ఫ్యాకల్టీ క్రికెట్ పోటీల్లో ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ చెన్నారెడ్డి టీమ్ గెలుపొందింది. క్యారమ్స్ సింగిల్స్‌లో ప్రొఫెసర్ వసుంధర గెలిచారు. సివిల్ విభాగాదిపతి అజిత రన్నర్‌గా నిలిచారు. డబుల్స్‌లో భారతి, మాధవి విజేతలు, అజిత, లలిత కుమారి రన్నర్‌గా నిలిచారు. టెన్నికాయట్‌లో వసుంధర గెలవగా, లలితకుమారి రెండో స్థానంలో నిలిచారు. డబుల్స్‌లో అజిత, మాధవి విజయం సాధించగా, వసుంధర, మాధవి రెండో స్థానంలో నిలిచారు. టేబుల్ టెన్నిస్‌లో సురేష్‌బాబు గెలవగా, భానుమూర్తి రెండో స్థానంలో నిలిచారు. డబుల్స్‌లో శశిధర్, శివకుమార్ విజేతలు కాగా, జీఎస్ఎస్ రాజు, కళ్యాణ్‌కుమార్ రెండో స్థానంలో నిలిచారు. టీచింగ్ అసిస్టెంట్ ఉమెన్ విభాగంలో బ్యాడ్మింటన్ విన్నర్‌గా అనూష నిలిచారు. చంద్రుష రెండో స్థానంలో నిలిచారు. డబుల్స్‌లో ఫిర్‌దోజ్, కళ్యాణి రన్నర్స్‌గాను మాధురి, మానస రన్నర్స్‌గా నిలిచారు. క్యారమ్స్‌లో చంద్రూష విన్నర్, మాధురి రన్నర్‌గా నిలిచారు. డబుల్స్‌లో అనూష, మానస గెలవగా, ఫిర్‌దోజ్, కళ్యాణి రెండో స్థానంలో నిలిచారు. క్రికెట్‌లో శశిధర్ రెడ్డి టీం విజయం సాధించగా సోమశేఖర్‌రెడ్డి కెప్టెన్ టీం రన్నరప్‌గా నిలిచింది. వాలీబాల్ పోటీల్లో కెప్టెన్ దాదా ఖలందర్ టీం గెలిచింది. కెప్టెన్ ఈశ్వర్ టీం రెండో స్థానంలో నిలిచారు. విద్యార్థుల క్రికెట్ పోటీల్లో మెకానికల్ స్టూడెంట్స్ విన్నర్‌గాను, కెమికల్ స్టూడెంట్స్ రన్నరప్‌గా నిలిచారు. వాలీబాల్ పోటీల్లో కెమికల్ ఇంజనీరింగ్ విభాగం విద్యార్థులు విజయం సాధించారు. మెకానికల్ విద్యార్థులు రెండో స్థానంలో నిలిచారు. బాస్కెట్ బాల్ పోటీలో ఈసీఈ విన్నర్‌గా, సివిల్ రన్నరప్, హ్యాండ్‌బాల్‌లో విన్నర్‌గా కెమికల్ ఇంజనీరింగ్ విభాగం, రన్నరప్‌గా సివిల్ ఇంజనీరింగ్ విద్యార్థులు నిలిచారు. ఖో-ఖో పోటీల్లో సివిల్ విద్యార్థులు గెలవగా, కెమికల్ ఇంజనీరింగ్ విద్యార్థులు రెండో స్థానంలో నిలిచారు. కబడ్డీలో కెమికల్ ఇంజనీరింగ్ విద్యార్థులు గెలవగా, మెకానికల్ ఇంజనీరింగ్ విద్యార్థులు రెండో స్థానంలో నిలిచారు.

జేఈఈ మెయిన్‌లో అనంత విద్యార్థులు అదుర్స్

నితిన్ అగ్నిహోత్రికి ఆలిండియా 67వ ర్యాంకు

పలువురు విద్యార్థులకు మెరుగైన ర్యాంకులు

అనంతపురం విద్య, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): జేఈఈ మెయిన్ సెషన్-2 ఫలితాల్లో అనంతపురం జిల్లా విద్యార్థులు సత్తా చాటారు. జిల్లాకు చెందిన విద్యార్థి నితిన్ అగ్నిహోత్రి ఆలిండియా ఓపెన్ కేటగిరీలో 67వ ర్యాంకు సాధించాడు.

ఈ నెల మొదటి వారంలో నిర్వహించిన జేఈఈ మెయిన్ సెషన్-2 పరీక్షల ఫలితాలను నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ(ఎన్టీఏ) శుక్రవారం రాత్రి విడుదల చేసింది. ఇందులో జిల్లాకు చెందిన పలువురు విద్యార్థులు అత్యుత్తమ ర్యాంకులతోపాటు ఉత్తమ పర్సంటైల్ సాధించారు. దీంతో విద్యార్థుల తల్లిదండ్రులు, కుటుంబికులు ఆనందం వ్యక్తం చేశారు.

మంచి బిల్డర్‌గా ఎదుగుతా: నితిన్

అనంతపురం నగరం మూడో రోడ్డులో నివాసం ఉండే కళ్యాణి, శ్రీకాంత్‌ల దంపతుల కుమారుడు భూపతి నితిన్ అగ్నిహోత్రి జేఈఈ మెయిన్ -2 పరీక్షల ఫలితాల్లో అదరగొట్టాడు. 300 మార్కులకు 290 మార్కులు సాధించాడు. ఆలిండియా స్థాయిలో 99.997 పర్సంటైల్ సాధించి 67వ ర్యాంకు దక్కించుకున్నాడు. విద్యార్థి భూపతి నితిన్ అగ్నిహోత్రి శనివారం 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడారు. ' మా నాన్న బిల్డర్. మా అన్న గువాహటిలో ఐఐటీ చదువుతున్నాడు. నాకు ఇంటర్‌లో 984 మార్కులు వచ్చాయి. నాకు మంచి ర్యాంకు వచ్చింది కాబట్టి ఏదైనా ప్రముఖ ఐఐటీ కాలేజ్‌లో ఇంజనీరింగ్ పూర్తి చేస్తా. తర్వాత మా నాన్న కలల ప్రపంచంలో అడుగుపెట్టి మంచి బిల్డర్‌గా ఎదగాలన్నదే నా కల' అన్నారు.

నారాయణ విద్యార్థుల హవా

జేఈఈ మెయిన్ సెషన్-2 ఫలితాల్లో నారాయణ విద్యార్థులు ఉత్తమ ర్యాంకులు సొంతం చేసుకున్నట్లు కళాశాల కోర్ డీన్ బద్రీనాథ్, డీజీఎం వెంకట్రామిరెడ్డి పేర్కొన్నారు. ఉత్తమ ర్యాంకులు సాధించిన విద్యార్థులను వారు ప్రత్యేకంగా అభినందించారు. వారు మాట్లాడుతూ...తమ విద్యార్థి భూపతి నితిన్ అగ్నిహోత్రి ఓపెన్ కేటగిరీలో 67వ ర్యాంకు సాధించి చరిత్ర సృష్టించాడన్నారు. పలువురు విద్యార్థులు ఓపెన్ కేటగిరీలో మంచి పర్సంటైల్ పొందారన్నారు. మహమ్మద్ ఆసిఫ్ 99.48 పర్సంటైల్‌తో 8053వ ర్యాంకు, భావన 99.43 పర్సంటైల్‌తో 8792వ ర్యాంకు, విశాల్ 99.36 పర్సంటైల్‌తో 9335వ ర్యాంకు, సవిత్‌కుమార్ రావు 99.32 పర్సంటైల్‌తో 10,473వ ర్యాంకు సాధించారన్నారు. 99 పర్సంటైల్ ఐదుగురు విద్యార్థులు, 98 పర్సంటైల్‌తో ఏడుగురు, 97 పర్సంటైల్‌పైన 12 మంది, 94 పర్సంటైల్ పైన 18 మంది విద్యార్థులు సాధించినట్లు తెలిపారు. కార్యక్రమంలో డీన్ శ్రీనివాసరెడ్డి,ఏజీఎంలు చంద్రశేఖర్ రెడ్డి, రాజశేఖర్ రెడ్డి, కేశవరెడ్డి, ప్రిన్సిపాళ్లు రవిశంకర్‌రెడ్డి, ఓబన్నగౌడ్, శిఖామణి, శైలజ, హిమబిందు, శ్రీధర్‌బాబు పాల్గొన్నారు.



నితిన్ అగ్నిహోత్రిని హైదరాబాద్‌లో అభినందిస్తున్న నారాయణ యాజమాన్యం

ఎస్ఆర్ కాలేజ్ విద్యార్థులకు ర్యాంకులు



ఎస్ఆర్ కాలేజ్‌లో...

జేఈఈ మెయిన్ ఫలితాల్లో పలువురు విద్యార్థులు మంచి ర్యాంకులు సాధించారని ఎస్ఆర్ విద్యాసంస్థల జోనల్ ఇన్‌చార్జి శివకుమార్, డీన్ రాధాకృష్ణ, ఏజీఎం జగన్ తెలిపారు. ఉత్తమ ర్యాంకులు పొందిన విద్యార్థులను అభినందించారు. వారు మాట్లాడుతూ తమ విద్యార్థి ఫణీంద్రకు 116 ర్యాంకు, కావ్యశ్రీకి 826వ ర్యాంకు, భవ్య 1150, చరణ్‌కుమార్ రెడ్డి 3776, శివ సాయినాయక్ 17304, తరుణ్‌కుమార్ 33,681, క్రిష్ణబాబు 34259, చరణ్ నాయక్ 38510, పవన్‌కుమార్ నాయక్ 38775, జగన్ కుమార్ నాయక్ 40140, మణికంఠ 42838, శ్రీకర్ 43685, హేమంత్ నాయక్ 44339, ప్రకాష్ నాయక్ 45918 ర్యాంకు సాధించారన్నారు. 1000లోపు ర్యాంకులు ఇద్దరికి, 2వేలలోపు ఇద్దరికి, 50 వేల లోపు 15 మందికి ర్యాంకులు వచ్చాయన్నారు. కార్యక్రమంలో ఏజీఎం వెంకటేశ్వర్లు, కల్పన, ప్రిన్సిపాళ్లు జగదీష్‌బాబు, భవానీ తదితరులు పాల్గొన్నారు.



ఉత్తమ ర్యాంకులు సాధించిన తేజ కాలేజీ విద్యార్థులు నందకుమార్, చందన, సురేందర్‌బాబు

తేజ జూనియర్ కాలేజ్ విద్యార్థుల హవా

తేజ జూనియర్ కాలేజ్ విద్యార్థులు జేఈఈ మెయిన్ ఫలితాల్లో మంచి ర్యాంకులు సాధించారని డైరెక్టర్ తేజేశ్వర్‌రెడ్డి, చైర్‌పర్సన్ ఉమాదేవి తెలిపారు. వారు మాట్లాడుతూ ఆలిండియా స్థాయిలో నంద కుమార్‌రెడ్డి 151వ ర్యాంకు, చందన 414వ ర్యాంకు, సురేంద్ర బాబు 1153వ ర్యాంకు, చరణ్ కుమార్ 1,355వ ర్యాంకు, నందీశ్వర్‌రెడ్డి 1,381వ ర్యాంకు, హరిత 8272వ ర్యాంకు, కిషాన్ 20346వ ర్యాంకు, నవనీత్ క్రిష్ణ 26602వ ర్యాంకు, సుధీర్‌కుమార్ 28993వ ర్యాంకు సాధించినట్లు పేర్కొన్నారు.

ఈతకు వెళ్లి యువకుడి మృతి

బ్రహ్మసముద్రం, ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని చెలిమేపల్లికి చెందిన టి.రంగప్ప కుమారుడు రంగస్వామి(35) ఈతకు వెళ్లి మృతి చెందాడు. రంగస్వామి కర్ణాటకలో తన భార్య ఊరిలో వ్యవసాయం చేసి జీవిస్తూ వుండేవాడు. శనివారం చెలిమేపల్లికి వచ్చి మిత్రులతో గోవిందయ్యదొడ్డి వద్ద వ్యవసాయ పొలంలో ఉన్న బావిలో ఈతకు వెళ్లి మునిగిపోయాడు. మిత్రులు బంధువులకు సమాచారం ఇచ్చారు. కళ్యాణదుర్గం నుంచి అగ్నిమాపక సిబ్బంది వచ్చి మృతదేహాన్ని బయటకు తీశారు. మృతుడికి భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు. ఎస్ఐ నరేంద్రకుమార్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

హత్యకేసులో నిందితుడి అరెస్ట్

హిందూపురం, ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి): హిందూపురం మండలం జి. గుడ్డంపల్లికి చెందిన సుబ్బరాయప్పను హత్యచేసిన కేసులో అదే గ్రామానికి చెందిన నంజయ్యగౌడ్‌ను శనివారం అరెస్ట్ చేసినట్లు అప్‌గ్రేడ్ సీఐ ఆంజనేయులు తెలిపారు. నీ భార్య వివాహేతర సంబంధం కొనసాగిస్తోందని కొన్నాళ కిందట నంజయ్యగౌడ్‌తో సుబ్బరాయప్ప అన్నాడు. అది నిజమని నమ్మి నంజయ్యగౌడ్ మద్యం తాగివచ్చి భార్యను చిత్రహింసలు పెట్టేవాడు. విసిగిపోయిన ఆమె నంజయ్యగౌడ్‌ను వదిలేసి బెంగళూరు వెళ్లిపోయింది. దీంతో అప్పటి నుంచి ఆయన ఒంటరిగా ఉన్నాడు. గ్రామంలో కూడా ఆయన్ను పట్టించుకునేవారు కాదు. ఈ తరుణంలో ఈనెల 15న మద్యం సేవించి సుబ్బరాయప్ప ఇంటివద్దకు వెళ్లి 'నీవు చెప్పిన మాటలు విని నా భార్యను కొట్టడం వల్లే వెళ్లిపోయింది' అని గొడవపడ్డాడు. కోపంతో అక్కడే ఉన్న ఇటుకపెల్లలు తీసుకుని సుబ్బరాయప్ప తలపై మోదాడు. తీవ్రంగా గాయపడిన ఆయన్ను కుటుంబ సభ్యులు బెంగళూరుకు తరలిస్తుండగా మృతి చెందాడు. దీనిపై పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు. నిందితుడు నంజయ్యగౌడ్‌ను శనివారం గోళ్లాపురం పారిశ్రామికవాడలో అరెస్ట్ చేసి కోర్టుకు హాజరు పరిచారు.



నిందితుడి అరెస్ట్ చూపుతున్న సీఐ, ఎస్ఐ

కారు ఢీకొని యువకుడి మృతి

పెనుకొండ రూరల్, ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి): మండలంలోని అమ్మవారిపల్లి సమీపంలో 44వ జాతీయరహదారిపై శనివారం ద్విచక్రవాహనాన్ని కారు ఢీకొన్న ప్రమాదంలో మల్లేష్ (21) మృతి చెందాడు. కియ పోలీసులు తెలిపిన మేరకు చెన్నేకొత్తపల్లి మండలం చిన్నపల్లి గ్రామానికి చెందిన ముత్యాలప్ప, పార్వతమ్మల కుమారుడు మల్లేష్ మూడు నెలల నుంచి కియ అనుబంధ పరిశ్రమ అనంతటెక్‌లో కార్మికుడిగా పని చేస్తున్నాడు. ఈ క్రమంలో శనివారం ద్విచక్రవాహనంపై పరిశ్రమకు వెళ్తూ అమ్మవారిపల్లి వద్ద బంక్‌లో పెట్రోల్ వేయించుకుని రోడ్డు దాటుతుండగా బెంగళూరు వైపు నుంచి అనంతపురం వెళ్లే కారు ఢీకొందన్నారు. ఈ ప్రమాదంలో మల్లేష్ అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు సంఘటనా స్థలం పరిశీలించి మృతదేహాన్ని పెనుకొండ ఆసుపత్రికి తరలించారు. తల్లి పార్వతమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ వెంకటరమణ తెలిపారు.

బస్టాండులో గుర్తుతెలియని వ్యక్తి...



మృతి చెందిన గుర్తు తెలియని వ్యక్తి

ధర్మవరం, ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి): స్థానిక ఆర్టీసీ బస్టాండ్‌లో గుర్తుతెలియని యువకుడు(32) మృతి చెందాడు. ప్రయాణికుల సమాచారంతో పోలీసులు సంఘటనాస్థలాన్ని పరిశీలించారు. మృతదేహాన్ని ప్రభుత్వాస్పత్రికి తరలించారు. వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు. వివరాలు తెలిసిన వారు 9440796831, 9440552808, 9440732538 నెంబర్లకు ఫోన్ చేయాలన్నారు.

వివాహిత ఆత్మహత్య

చిలమత్తూరు, ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి): మండలంలోని వడ్డిచెన్నంపల్లికి చెందిన పవిత్ర (24) అనే వివాహిత శనివారం ఇంట్లో ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. ఎస్ఐ మునీర్ అహమ్మద్ తెలిపిన మేరకు.. పవిత్రకు అదే గ్రామానికి చెందిన అశోక్‌తో వివాహమయింది. ప్రస్తుతం 15 నెలల పాప ఉంది. కడుపు నొప్పితో తీవ్ర ఇబ్బందుపడుతుండేది. చికిత్సలు చేయించినా ఫలితం లేకపోవడంతో మనస్థాపానికి గురై ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కి ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడిందన్నా రు. మృతురాలి తల్లి గంగరత్నమ్మ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

చీనీకాయలు టన్ను రూ.19వేలు

అనంతపురంరూరల్, ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి): అనంతపురం వ్యవసాయ మార్కెట్‌లో శనివారం చీనీకాయలు టన్ను గరిష్ఠంగా రూ.19వేలు, కనిష్ఠంగా రూ.3 వేలు, సరాసరి రూ.14వేలతో అమ్ముడుపోయినట్లు మార్కెట్ ఎంపికశ్రేణి కార్యదర్శి గోవిందు తెలిపారు.

ప్లాస్టిక్ నిషేధం.. ప్రకటనలకే పరిమితం ..!



నర్సరీ నిర్వాహకులు పడేసిన కవర్లు

- ముదిగుబ్బలో యథేచ్ఛగా కవర్ల విక్రయాలు
- వ్యాపారులపై దాడులతోనే అధికారులు సరి
- వాటిని ఉత్పత్తి, సరఫరా వారిపై చర్యలు శూన్యం

ముదిగుబ్బ, ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి): మండలంలో నిషేధిత ప్లాస్టిక్ వస్తువుల వాడకం రోజురోజుకు పెరుగుతోంది. ఎక్కడ చూసినా ప్లాస్టిక్ వ్యర్థాలు పేరుకుపోతున్నాయి. ప్లాస్టిక్ కవర్లను వాడరాదనే అధికారుల ఆదేశాలు ప్రకటనలకే పరిమితం అవుతున్నాయి. మండలాన్ని శుభ్రంగా ఉంచేందుకు ప్రజలు సహకరించాలని, నిత్యం చెత్తను తరలించే ఆటోల్లో ప్రచారం చేస్తున్నారే తప్ప.. వాటిని కఠినంగా అమలు చేయడానికి ఎటువంటి చర్యలూ తీసుకోవడం లేదు. దీంతో ప్లాస్టిక్ వినియోగం రోజురోజుకూ పెరుగుతోంది. మురుగు కాలువలు, చెత్త దిబ్బలు ప్లాస్టిక్ కవర్లతో నిండిపోతున్నాయి. ప్లాస్టిక్ వ్యర్థాలతో కాలువలు నిండిపోవడంతో మురుగు ముందుకు కదలడం లేదు. దీంతో కాలువల్లో మురుగు నిల్వ ఉండటంతో దోమలు అధికమై ప్రజలు రోగాల బారిన పడుతున్నారు. ప్లాస్టిక్ కవర్లను తోపుడు బండ్లు, పూల వ్యాపారులు, మాంసం విక్రయదారులు, హోటళ్ళు, కిరాణా దుకాణాలు, మద్యం దుకాణాలు, పండ్లు అమ్మకందారులు, మెడికల్ దుకాణాలో విరివిగా వినియోగిస్తున్నారు.

● మొక్కుబడిగా దాడులు

ప్రభుత్వం, స్వచ్ఛంద సంస్థలు నిషేధిత ప్లాస్టిక్ వాడకంపై, వాటి వలన వచ్చే నష్టాలపై ప్రజలలో ప్రత్యేక అవగాహన కల్పిస్తున్నా .. వాటి వాడకం తగ్గడం లేదు. అధికారులు కూడా కేవలం వ్యాపారులపై దాడులు చేసి.. ప్లాస్టిక్ కవర్లను స్వాధీనం చేసుకొని.. జరిమానాలు విధించడానికే పరిమితం అవుతున్నారు. అసలు ఆ ప్లాస్టిక్ కవర్లను ఉత్పత్తి చేసేవారిపై .. వాటిని దుకాణాలకు సరఫరా చేసే వారిపై కనీస చర్యలు కూడా తీసుకోవడం లేదు. అధికారులు ఇలా తూతూ మంత్రంగా దాడులు నిర్వహిస్తూ.. ప్లాస్టిక్ నిషేధాన్ని ప్రకటనలకే పరిమితం చేస్తున్నారు.

● మూగజీవాలు బలి

మండల కేంద్రంలోని చెత్త కుప్పల్లో ప్లాస్టిక్ వ్యర్థాలు అధికంగా కన్పిస్తున్నాయి. మిగిలిన .. వ్యర్థ ఆహార పదార్థాలను ప్లాస్టిక్ కవర్లలో ఉంచి చెత్తకుప్పల్లో వేస్తున్నారు. ఆ ఆహార పదార్థాలతో పాటు ఆ ప్లాస్టిక్ కవర్లనూ మూగజీవాలు తింటుండటంతో అవి అనారోగ్యానికి గురవుతున్నాయి. ప్లాస్టిక్ కవర్లను తిని అనారోగ్యం బారిన పడిన పశువులకు చికిత్స కోసం రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పలు మూగజీవాలు అనారోగ్యంతో మృత్యువాతపడుతున్నాయి.

● నర్సరీల నుంచి వ్యర్థాలు

ముదిగుబ్బ ప్రాంతంలో నర్సరీలు అధికంగా ఉన్నాయి. వీరు అధిక మొత్తంలో ప్లాస్టిక్ కవర్లను వాడుతున్నారు. వృథా అయిన వాటిని రోడ్డు పక్కన పడేస్తున్నారు. ఇలా ప్లాస్టిక్ కవర్లను వినియోగించరాదని అవగాహన కల్పించడంలో అధికారులు విఫలమయ్యారు.

● అనర్థాలపై అవగాహన ..

మండల కేంద్రంలోని శాంతి ఆనంద ఎడ్యుకేషన్ సొసైటీ ప్లాస్టిక్ వాడకంతో కలిగే అనర్థాలపై పలు అవగాహన కార్యక్రమాలను చేపడుతోంది. అంతేకాకుండా ప్లాస్టిక్‌ను నిషేధించాలని, ప్లాస్టిక్ భూతాన్ని తరిమి కొట్టాలని, ప్లాస్టిక్ వల్ల కలిగే అనర్థాలపై అవగాహన ర్యాలీలు చేపట్టింది. అధికారులు ఈ విషయంలో కఠినంగా వ్యవహరించాలని ధర్నాలు చేపట్టి.. వినతిపత్రాలూ అందజేసింది. ఈ విషయంపై సంబంధిత అధికారుల వివరణ కోసం ప్రయత్నించగా అధికారులు అందుబాటులోకి రాలేదు.



వాసవీ నగర్‌లో పేరుకుపోయిన ప్లాస్టిక్ వ్యర్థాలు

కఠిన చర్యలతోనే కట్టడి సాధ్యం



ప్లాస్టిక్ నిర్మూలనపై, వాటి వల్ల కలిగే అనర్థాలపై శాంతి ఆనంద ఎడ్యుకేషన్ సొసైటీ ఆధ్వర్యంలో అనేక అవగాహన కార్యక్రమాలను చేపట్టాం. విద్యార్థులతో అవగాహన ర్యాలీని నిర్వహించారు. నిషేధిత ప్లాస్టిక్ వస్తువులను అడ్డుకోవాలని అధికారులకు పలుమార్లు వినతి పత్రాలు ఇచ్చాం. అయినా ఫలితం లేదు. ఆ కవర్లను ఉత్పత్తి.. సరఫరా.. విక్రయించేవారిపై కఠిన చర్యలు తీసుకుంటేనే కట్టడి సాధ్యమవుతుంది.

- చంద్రమోహన్, శాంతి ఆనంద ఎడ్యుకేషన్ సొసైటీ అధ్యక్షుడు, ముదిగుబ్బ

న్యూస్ బాక్స్

కొనసాగుతున్న ముస్లింల నిరాహారదీక్ష

ధర్మవరం, ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి): వక్ఫ్‌బోర్డు సవరణ బిల్లు చట్టాన్ని రద్దు చేయాలని స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట ముస్లింలు చేపట్టి నిరాహారదీక్ష శనివారానికి ఎనిమిదో రోజుకు చేరింది. ఈ దీక్షకు సీపీఐ నాయకులు రమణ, ఏపీ చేనేత కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటనారాయణ, జిల్లా గౌరవాధ్యక్షుడు వెంకటస్వామి, ప్లంబర్స్ అసోషియేషన్ నాయకులు మద్దతు ప్రకటించారు.

నేడు చంద్రబాబు జన్మదిన వేడుకలు

పుట్టపర్తి రూరల్, ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు జన్మదిన వేడుకలను స్థానిక తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఆదివారం ఉదయం 10 గంటలకు నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. జిల్లాకేంద్రంలోని వృద్ధాశ్రమాలు, ఆసుపత్రుల్లో సేవాకార్యక్రమాలు చేపడుతున్నట్లు, కొత్తచెరువు నెహ్రూరా కూడలిలోని ఎన్టీఆర్ విగ్రహానికి నివాళులు అర్పిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమాల్లో నియోజకవర్గంలోని తెలుగుదేశం, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

● ధర్మవరం : సీఎం చంద్రబాబు జన్మదిన వేడుకలను ఆదివారం నిర్వహిస్తున్నామని, కార్యకర్తలు, అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని టీడీపీ నాయకులు ఓ ప్రకటనలో కోరారు. ఉదయం 8.30 గంటలకు లక్ష్మీచెన్నకేశవస్వామి ఆలయంలో చంద్రబాబునాయుడు పేరిట అర్చన, పూజా కార్యక్రమాలు, అనంతరం ప్రభుత్వాస్పత్రిలో రోగులకు పండ్లు, బ్రెడ్డు పంపిణీ ఉంటుందన్నారు. అలాగే గాంధీనగర్ టీడీపీ కార్యాలయంలో కేక్‌కటింగ్, అనంతరం భోజనాలు ఏర్పాటు చేశామన్నారు.

మోదీ విధానాలతో ఆర్థిక సంక్షోభం



మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

కదిరిఅర్బన్, ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి): ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ విధానాల వల్ల దేశం ఆర్థిక సంక్షోభంలో కొట్టుమిట్టాడుతోందని కాంగ్రెస్ పార్టీ కదిరి, పుట్టపర్తి నియోజకవర్గాల సమన్వయకర్తలు కెఎస్ షాన్వాజ్, మధుసూధన్‌రెడ్డి విమర్శించారు. శనివారం వారు స్థానిక ఆ పార్టీ కార్యాలయంలో మాట్లాడుతూ... నల్లధనం వెలికి తీస్తామన్న మోదీ.. నేడు ఆ ఊసే ఎత్తలేదన్నారు. మతం పేరుతో దేశాన్ని విభజించి, రాజకీయ పబ్బం గడుపుకోవడానికి బీజేపీ యత్నిస్తోందన్నారు.

వైసీపీ ఆరోపణలు మానుకోవాలి

ఓబుళదేవరచెరువు, ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి): టీటీడీ గోశాల గురించి వైసీపీ నాయకులు తప్పుడు ఆరోపణలు చేయడం మానుకోవాలని ఎంపీటీసీ శ్రీనివాసులు, బీజేపీ కన్వీనర్ వీరాంజి సూచించారు. శనివారం మండల కేంద్రంలో వారు మాట్లాడుతూ.. టీటీడీ మాజీ చైర్మన్ భూమున కరుణాకర్‌రెడ్డి గోశాల గురించి తప్పుడు ప్రచారం చేయడం మానుకోవాలన్నారు. తిరుమల కొండపై అన్యమత ప్రచారం ప్రోత్సహించింది వైసీపీ ప్రభుత్వ కాదా అని ప్రశ్నించారు.

జూనియర్ కళాశాల ప్రారంభమెప్పుడో..?



జూనియర్ కళాశాల కోసం నిర్మించిన భవనం

గాండ్లపెంట, ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ఇంటర్ కళాశాల ఎప్పుడు ప్రారంభం అవుతోందనని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు మూడేళ్లుగా ఎదురు చూస్తున్నారు. గత ప్రభుత్వంలో నాబార్డు నిధులు రూ.25 లక్షలతో ఎనిమిది గదులను కళాశాల కోసం నిర్మించింది. స్థానిక జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణంలో ఈ భవనాన్ని నిర్మించి.. మూడేళ్లు అవుతున్నా.. నాటి.. నేటి పాలకులు, అధికారులు ఏ మాత్రం పట్టించుకోలేదు. దీంతో మండలంలోని ఇంటర్ విద్యార్థులు వందలాది మంది ఇతర ప్రాంతాలకు వెళ్లి చదువుకొంటున్నారు. ఆర్థిక ఇబ్బందులు ఉన్న వారు చదువుకు దూరం అవుతున్నారు. మండలంలో గాండ్లపెంట, కటారుపల్లి, తుమ్మలబైలు, నీరుకుంట్లపల్లి, రెక్కమాను, కేజీబీవీ, ఆదర్శ ప్రైవేటు పాఠశాల, రెక్కమాను శాంతినికేతన్ పాఠశాలలో సుమారు 370 మంది విద్యార్థులు ఈ సంవత్సరం టెన్త్ పరీక్షలు రాశారు. ఈ సంవత్సరమైనా ఇక్కడ ఇంటర్ కళాశాలను ప్రారంభిస్తే .. తమ పిల్లలను ఇతర ప్రాంతాలకు చదువు కోసం పంపే బాధలు తప్పుతాయని తల్లిదండ్రులు ఆశగా ఎదురు చూస్తున్నారు. ఈ సంవత్సరమైనా ఇంటర్ కళాశాలను ప్రారంభించేలా పాలకులు, అధికారులు చర్యలు తీసుకోవాలని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు కోరుతున్నారు. దీనిపై హెచ్‌ఎం సిద్దారెడ్డి వివరణ కోరగా.. ఇంటర్ కళాశాల ప్రారంభానికి ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు రాలేదని, వస్తే ఇంటర్ మొదటి సంవత్సరం అడ్మిషన్లు ప్రారంభిస్తామని ఆయన తెలిపారు.

క్షణికావేశంలో బాలిక ఆత్మహత్య

పుట్టపర్తిరూరల్, ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి): మండలంలోని గువ్వలగుట్టపల్లి గ్రామంలో తండ్రి మందలించాడని క్షణికావేశంలో వరలక్ష్మి (13) శనివారం ఆత్మహత్య చేసుకుంది. వెంకటేసు, అలివేలమ్మ కుమార్తె వరలక్ష్మి జగరాజ్‌పల్లిలోని ఆదర్శ పాఠశాలలో ఎనిమిదో తరగతి చదివేది. స్కూల్‌కు సెలవులు కావడంతో ఇంటి వద్దనే ఉంటోంది. శనివారం స్నేహితులతో కలసి ఈతకు వెళ్లింది. ఇది తెలిసిన తండ్రి ఆ బాలికను మందలించడంతో మనస్థాపానికి గురైంది. ఇంట్లో ఎవరూ లేని సమయంలో బాత్‌రూంలోకి వెళ్లి చున్నీతో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. ఇంటికి వచ్చిన తల్లి .. బాత్‌రూం లోపల ఉన్న వరలక్ష్మిని ఎంతగా పలిచినా స్పందన రాలేదు. దీంతో బాత్‌రూం తలుపు పగులగొట్టి చూడగా .. వరలక్ష్మి ఉరేసుకొని ఆత్మహత్య చేసుకొని ఉన్నట్లు గుర్తించింది. ఆమె ఫిర్యాదు మేరకు పుట్టపర్తి రూరల్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.



జిల్లా పోలీసు కార్యాలయ పరిసరాలను శుభ్రం చేస్తున్న ఎస్పీ రత్న

ఉత్సాహంగా స్వచ్ఛాంధ్ర - స్వచ్ఛ దివస్

పుట్టపర్తి రూరల్, ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి): పుట్టపర్తి, ధర్మవరం, కదిరి నియోజకవర్గాల్లో శనివారం స్వచ్ఛాంధ్ర - స్వచ్ఛ దివస్ కార్యక్రమాన్ని ఉత్సాహంగా నిర్వహించారు. జిల్లా పోలీసు కార్యాలయ ఆవరణలో చెత్త, పిచ్చిమొక్కలను ఎస్పీ రత్న, పోలీసు అధికారులు, సిబ్బంది తొలగించారు.

● కదిరి : స్థానిక బాలికల ఉన్నత పాఠశాల నుంచి అంబేడ్కర్ సర్కిల్ వరకు ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ ఆధ్వర్యంలో స్వచ్ఛంధ్ర - స్వచ్ఛదివస్ ర్యాలీ నిర్వహించారు. మానవహారం ఏర్పాటు చేసి ప్రతిజ్ఞ చేయించారు. టీడీపీ రాష్ట్ర కార్యదర్శి పవన్‌కుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

● ధర్మవరం: స్వచ్ఛాంధ్ర - స్వచ్ఛ దివస్‌లో భాగంగా ఆర్డీఓ మహేశ్, మున్సిపల్ కమిషనర్ ప్రమోద్‌కుమార్ ఈ - వేస్ట్ (పనికిరాని ఎలక్ట్రానిక్ వస్తువులు)పై అవగాహన కల్పించారు. పనికిరాని ఎలక్ట్రానిక్ సామగ్రిని ప్రత్యేకంగా సేకరించి, డంపు యార్డులో ప్రత్యేక గదిలో ఉంచాలన్నారు.

● అలాగే ముదిగుబ్బ, బత్తలపల్లి, తాడిమర్రి, నంబులపూలకుంట, నల్లమాడ, బుక్కపట్నం, గాండ్లపెంట, ఓడీసీ తదితర ప్రాంతాల్లోనూ ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.

వేలం పాటలో వాగ్వాదం



వేలం పాటలో సర్పంచ్ భర్త, ఉపసర్పంచ్ వాగ్వాదం

కొత్తచెరువు, ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి): స్థానిక పంచాయతీకి చెందిన 48 వ్యాపార గదులకు నిర్వహించిన వేలం పాటలో సర్పంచ్ భర్త, ఉపసర్పంచ్ వాగ్వాదానికి దిగారు. మొత్తం 49 గదులకు వేలం నిర్వహించాల్సి ఉండగా.. 28 గదులకు మాత్రమే అధికారులు వేలం పాట నిర్వహించారు. మిగిలిన గదులకు వేలం పాట ఎందుకు నిర్వహించలేదని ఉప సర్పంచ్ యుగంధర్ అధికారులను ప్రశ్నించారు. కొంతమంది గదులకు అద్దెలు చెల్లించకపోవడంతో ఆ గదులను వేలం పాట నిర్వహించలేదని పంచాయతీ అధికారులు తెలిపారు. అంతలో సర్పంచ్ భర్త నాగరాజు కల్పించుకుని ఆ గదులు రూ. లక్షల్లో బకాయిలు ఉన్నాయని, అందుకు నిర్వహించలేదని సమాధానం ఇచ్చారు. అందులో మీకు సంబంధించిన గదులు, సంతకు బకాయిలు ఉన్నాయి కదా... మీరే చెల్లించకపోతే మిగిలిన వారు ఎలా చెల్లిస్తారని ఉప సర్పంచ్ ప్రశ్నించారు. దీంతో ఇద్దరి మధ్య వాగ్వాదం జరిగింది. ఇరువురు దుర్భాషలాడుకున్నారు. దీంతో సీఐ సురేశ్‌బాబు కల్పించుకుని వారిద్దరిని వేలంపాటలో లేనివారిని పంపించివేశారు. అనంతరం అధికారులు వేలంపాటు నిర్వహించారు. ఇందులో 19వ గదిని అత్యధికంగా రూ.42,600 లకు అశోక్, 16వ గదిని రామక్రిష్ణ రూ..35100లకు దక్కించుకున్నారు. మిగిలిన గదులను స్వల్పంగా వేలం పాటలో పలువురు దక్కించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ఎంపీడీఓ నటరాజ్, ఇన్‌చార్జ్ కార్యదర్శి నాగరాజు పాల్గొన్నారు.

ఓటరు జాబితాపై సమావేశం



నాయకులతో సమావేశమైన ఆర్డీఓ

ధర్మవరం, ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి): ఓటరు జాబితాలో చేర్పులు, మార్పులు, తొలగింపులు, ఇతర సమస్యలపై అన్ని రాజకీయ పార్టీల నాయకులతో శనివారం ఆర్డీఓ మహేశ్ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పలు అంశాలపై ఆర్డీఓ చర్చించారు. ఓటరు జాబితాను పకడ్బందీగా చేపట్టామని తెలిపారు. ఈ సమావేశంలో ఏఈఆర్‌ఓలు, ఎన్నికల డిప్యూటి తహసీల్దార్, ఎన్నికల సీనియర్ సహాయకులు, కంప్యూటర్ ఆపరేటర్లు పాల్గొన్నారు.

అగ్నిప్రమాదాల నివారణపై అవగాహన

కదిరి, ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి): స్థానిక త్రివేణి ఆసుపత్రి, ప్రభుత్వ ఆసుపత్రిలో శనివారం అగ్ని ప్రమాదాల నివారణపై ఇన్‌ఛార్జీ అగ్నిమాపకాధికారి శ్రీధర్ అవగాహన కల్పించారు. ఈకార్యక్రమంలో అగ్నిమాపక సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

నీటి తొట్టెల పనులు ప్రారంభం



నీటి తొట్టి నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే

తనకల్లు, ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి): మండలంలోని టి.సదుం గ్రామంలో పశువుల నీటి తొట్ల నిర్మాణ పనులను ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ శనివారం భూమి పూజ చేసి ప్రారంభించారు. అలాగే అదే గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాల వార్షికోత్సవంలో ఆయన పాల్గొన్నారు. పాఠశాల ప్రహరీని ప్రారంభించారు. కొక్కంటి క్రాస్ నుంచి బాలసముద్రం, టి.సదుం మీదుగా కొక్కంటి రోడ్డు వరకు రహదారి నిర్మాణ పనులను త్వరలోనే చేపడతామని హామీ ఇచ్చారు. ఐసీడీఎస్ ఆధ్వర్యంలో స్వచ్ఛంధ్ర కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన ర్యాలీలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో కన్వీనర్ రెడ్డిశేఖర్‌రెడ్డి, సీనియర్ నాయకులు ఈశ్వర్‌రెడ్డి, శంకర్‌నాయుడు, ఫణీకర్‌రెడ్డి, చలపతి, నాయకులు పీజీ మల్లికార్జున, నాగభూషణం, శ్రీధర్‌రెడ్డి, చంద్రారెడ్డి, షబ్బీర్, నాయకులు, కార్యకర్తలు, అన్నిశాఖలాధికారులు పాల్గొన్నారు.

● ఎమ్మెల్యేకు సన్మానం

కదిరి : స్థానిక నారాయణ పాఠశాల వార్షికోత్సవాన్ని స్థానిక పీవీఆర్ ఫంక్షన్ హాల్‌లో శుక్రవారం రాత్రి ఘనంగా నిర్వహించారు. ఇందులో ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్‌ను సన్మానించారు. కార్యక్రమంలో ఆ పాఠశాల ఏజీఎం రమేష్‌బాబు, ప్రధానోపాధ్యాయులు సర్ఫరాజ్‌ఖాన్, ప్రేమసాయి రెడ్డి, రెడ్డిహరిత, జీవీ, జక్రియా, నియామత్, హరిత పాల్గొన్నారు.

హంద్రీనీవా లైనింగ్ పనులు ఆపాలి



మాట్లాడుతున్న రైతు సంఘం నాయకులు

కదిరిఅర్బన్, ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి): జిల్లాలో హంద్రీనీవా లైనింగ్ పనులు ఆపాలని ఏపీ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన్ కార్యదర్శి ప్రభాకార్ రెడ్డి డిమాండ్ చేశారు. శనివారం పట్టణంలోని రైతు సంఘం కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. జిల్లా అవసరాలకు తగట్టుగా నీటిని కేటాయించకపోగా, ప్రధాన కాలువను కాంక్రీట్ లైనింగ్ చేయడం వల్ల రైతులకు తీరని అన్యాయం చేసినట్లు అవుతుందన్నారు. లైనింగ్ పనుల వల్ల భూగర్భజల్లాలు అడుగట్టుతాయన్నారు. బోర్ల కింద వాణిజ్య పంటలపై ఆదారపడిన రైతులకు నష్టం జరుగుతుందన్నారు. ప్రభుత్వం కాలువను వెడల్పు చేసి, పిల్లకాలువుల ద్వారా చెరువులకు నీరు అందించాలన్నారు. జిల్లాలోని ఎన్పీకుంట, మడకశిర, రొద్దం, పుట్టపర్తి తదితర ప్రాంతాల్లో సోలార్ విద్యుత్ కోసం భూములు కోల్పోయిన రైతులకు వెంటనే పరిహారం అందించాలన్నారు. మామిడి రైతులకు గిట్టుబాటు ధరలు కల్పించి, మార్కెట్ సౌకర్యం కల్పించాలన్నారు. ఈ సమావేశంలో నాయకులు హరి, పెద్దన్న, సుధాకర్‌రెడ్డి, శంకర్‌రెడ్డి పాల్గొన్నారు.

న్యాయాధికారికి సన్మానం



న్యాయాధికారిని సన్మానిస్తున్న న్యాయవాదులు

ధర్మవరం, ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి): స్థానిక కోర్టులో సీనియర్ సివిల్ న్యాయాధికారి గీతావాణి నెల్లూరు జిల్లా కావలికి బదిలీ అయ్యారు. దీంతో ఆమెను బార్ అసోషియేషన్ కమిటీ సభ్యులు, న్యాయవాదులు శనివారం ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపుల్ జూనియర్ సివిల్ న్యాయాధికారి రమ్యసాయి, బార్ అసోషియేషన్ అధ్యక్షుడు కరీం, జనరల్ సెక్రటరీ డీఎల్ఎన్ మూర్తి, ఉపాధ్యక్షుడు నూర్ అహమ్మద్, సహాయ కార్యదర్శి బాలసుందరీ, కోశాధికారి అబ్దుల్లా, సీనియర్, జూనియర్ న్యాయవాదులు పాల్గొన్నారు.

రేపు ఎద్దుల పరుష వేలం

తనకల్లు, ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి): మండలంలోని తవళం గ్రామ సమీపంలో పాపాగ్ని నది పరివాహక ప్రాంతంలోని తవళం ఆంజనేయస్వామి ఎద్దుల పరుష వేలాన్ని సోమవారం నిర్వహిస్తున్నట్లు ఆలయ ట్రస్టు బోర్డు చైర్మన్ గంగసాని ఈశ్వర్‌రెడ్డి తెలిపారు. ఆసక్తిగల వారు ఈ వేలంలో పాల్గొనాలని సూచించారు.

క్రైం న్యూస్ ..

వృద్ధుడి మృతికి కారకులపై కేసు

బత్తలపల్లి, ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎం చెర్లోపల్లి గ్రామంలో శుక్రవారం చిత్రా ఓబులేసు మరణానికి కారణమైన శంకరయ్య, అతని కుమారుడు కేశవపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ సోమశేఖర్ శనివారం తెలిపారు. శంకరయ్య అడవి పందుల నుంచి మొక్కజొన్న పంటను కాపాడుకునేందుకు విద్యుత్ తీగలు ఏర్పాటు చేశాడు. దీనికి గ్రామంలోని స్తంభం నుంచి జీఏ వైరు ద్వారా కనెక్షన్ తీసుకున్నాడు. ఇలా ఇళ్ల మధ్య నుంచి విద్యుత్ తీగలు ఏర్పాటు చేస్తే ఎదైనా ప్రమాదం జరిగితే ఎవరు బాధ్యులని గతంలోనే గ్రామస్థులు వారికి అడ్డు చెప్పారు. అయినా వారు వినలేదు. శుక్రవారం ఆ జీఏ వైరు తాకడంతో చిత్రా ఓబులేసు మరణించడంతో పాటు మరో ముగ్గురు గాయపడ్డారు. దీనిపై విద్యుత్ శాఖ ఏఈ శివయ్య ఫిర్యాదు మేరకు వారిద్దరిపై కేసు నమోదు చేశామని ఎస్ఐ తెలిపారు.

కులం పేరుతో దూషించాడని ...

ధర్మవరం, ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి): స్థానిక ఇందిరమ్మ కాలనీకి చెందిన నిట్టూరు సుబహాన్‌పై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదైంది. జగ్జీవన్‌రాంనగర్‌కు చెందిన సాకే దినేశ్ జూనియర్ లైన్‌మన్‌గా పనిచేస్తున్నాడు. నిట్టూరు సుబహాన్ రెండు నెలలుగా విద్యుత్ బిల్లు చెల్లించలేదు. దీంతో ఆ బిల్లులు చెల్లించాలని సాకే దినేశ్ కోరడంతో.. ఆ డబ్బులను ఫోన్‌పే ద్వారా సుబహాన్‌కు మూడు రోజుల క్రితం చెల్లించాడు. శుక్రవారం కట్టిన బిల్లు రసీదు ఇవ్వాలని సాకే దినేశ్‌ను కులం పేరుతో దూషించాడు. దీనిపై లైన్‌మన్ టూటౌన్ పోలీసులకు సుబహాన్‌పై శనివారం ఫిర్యాదు చేశారు. దీంతో సుబహాన్‌పై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేసినట్లు సీఐ రెడ్డప్ప తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

ముదిగుబ్బ, ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి): స్థానిక కస్తూర్బా కాలనీ సమీపంలోని హైవే రోడ్డుపై కారు ఢీకొనడంతో .. బైక్‌పై వెళ్తున్న ఓడీసీ మండలం బత్తినపల్లి గ్రామానికి చెందిన మోహన్ శనివారం గాయపడ్డాడు. మోహన్ బత్తలపల్లి వైపు నుంచి బైక్‌పై స్వగ్రామానికి వెళ్తుండగా.. ఈ ప్రమాదం జరిగింది. గాయపడ్డ అతన్ని 108 వాహనంలో కదిరి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

హత్యాయత్నం కేసులో ముగ్గురి అరెస్టు

కదిరిఅర్బన్, ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి): మండలంలోని కుమ్మరవాండ్లపల్లికి చెందిన నవీన్ కుమార్‌పై హత్యాయత్నానికి పాల్పడిన ముగ్గురిని అరెస్టు చేసినట్లు రూరల్ సీఐ నిరంజన్‌రెడ్డి శనివారం తెలిపారు. నవీన్‌కుమార్‌పై కదిరికి చెందిన షేక్‌వలీబాషా, షేక్ అర్షాన్, బాలమురళీక్రిష్ణ ఈనెల 14న కుమ్మరవాండ్లపల్లిలో హత్య చేయడానికి యత్నించారన్నారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేశామని, నిందితులను శనివారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామని చెప్పారు.

14 మంది జూదరులు ..

ధర్మవరం రూరల్, ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి): మండలంలోని చిగిచెర్ల గ్రామ సమీపంలో పేకాట ఆడుతున్న 14 మందిని పేకాట రాయుళ్లను శనివారం అరెస్టు చేసినట్లు రూరల్ సీఐ ప్రభాకర్ తెలిపారు. వారి నుంచి రూ. 35 వేలు స్వాధీనం చేసుకుని.. కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు.

శ్మశాన వాటికకు స్థలం కేటాయించాలి



కరపత్రాలతో సీపీఎం నాయకులు, గ్రామస్థులు

కొత్తచెరువు, ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఇరగంపల్లిలో శ్మశాన వాటికకు స్థలం కేటాయించాలని సీపీఎం నాయకులు, గ్రామస్థులు కోరారు. బుధవారం పెద్ద ఎత్తున తహసీల్దార్ కార్యాలయానికి తరలివెళ్లి వినతిపత్రాలు అందజేస్తామన్నారు. అందుకు సంబంధించిన కరపత్రాలతో శనివారం గ్రామంలో ఇంటింటికి వెళ్లి.. ప్రచారం చేశారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు ఈఎస్ వెంకటేశ్, మండల కార్యదర్శి ముత్యాలు మాట్లాడుతూ ... గ్రామానికి శ్మశాన వాటిక లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, పలుమార్లు ఈ విషయాన్ని రెవెన్యూ అధికారులు, ప్రజాప్రతినిధులకు విన్నవించినా పట్టించుకోలేదని అన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు బ్యాళ్ల అంజి, వెంకటరాముడు, లక్ష్మయ్య, బొగ్గు అంజినేయులు పాల్గొన్నారు.

బాల్యవివాహం నిలిపివేత

గాండ్లపెంట, ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఓ గ్రామంలో బాల్యవివాహాన్ని నిలిపివేసేలా చర్యలు తీసుకున్నామని పోలీసులు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పద్మావతమ్మ శనివారం తెలిపారు. బాలికకు వివాహం నిర్వహిస్తున్నట్లు సమాచారం అందిందన్నారు. వెంటనే ఆ బాలిక తల్లిదండ్రులను స్టేషన్‌కు పిలిపించి బాల్యవివాహం చట్టరిత్యా నేరమని, ఇలాంటి వివాహాల వల్ల కలిగే అనర్థాలను వివరించామని తెలిపారు. ఈ కార్యక్రమంలో హెడ్‌కానిస్టేబుల్ గంగాధర్, మహిళ పోలీస్ శిరీషా, అంగన్‌వాడీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఇచ్చిన మాట నిలబెట్టుకున్నా

- బీసీ సంక్షేమ, చేనేత, జౌళిశాఖ మంత్రి సవిత
- రూ.1.5కోట్లతో రోడ్డు పనికి భూమిపూజ
- హంద్రీనీవా కాలువ పనుల పరిశీలన



శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి సవిత

సోమందేపల్లి, ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి): ఎన్నికల వేళ ప్రజలకు రోడ్డువేయిస్తానని మాటిచ్చాను.. ఈరోజు నిలబెట్టుకున్నాను.. అని బీసీ సంక్షేమ చేనేత జౌళిశాఖ మంత్రి సవిత పేర్కొన్నారు. శనివారం మండలంలోని జూలకుంట నుంచి సుద్దకుంటపల్లి వరకు ఎన్ఆర్ఈజీఎస్ పథకం రూ.1.50కోట్లతో నిర్మించనున్న బీటీ రోడ్డు పనులకు ఆమె భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అతి తక్కువ కాలంలోనే సోమందేపల్లిలో రూ.6కోట్లతో సీసీ రోడ్లు, డ్రైనేజీలు నిర్మించామన్నారు. మండలానికి 52గోకులాల షెడ్లు నిర్మించామన్నారు. సీఎం సహాయనిధి కింద రూ.8లక్షలను బాధితులకు అందజేయడం జరిగిందని వివరించారు. జూలకుంటలో రూ.12లక్షలతో సీసీరోడ్లు, డ్రైనేజీ నిర్మించామని, 58పశువుల నీటి తొట్టెలను మంజూరు చేశామన్నారు. జూలకుంట నుండి ఐదు పంచాయతీలను కలుపుతూ కేతగాని చెరువు మీదుగా హిందూపురానికి వెళ్లే దారి కొన్నేళ్లుగా పెండింగ్‌లో ఉందన్నారు. గత పాలకులు రాష్ట్రంలో ఒక్క రోడ్డుకూడా నిర్మాణం చేపట్టలేదన్నారు. అడిగిన వెంటనే నిధులు మంజూరు చేసిన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్‌కు ఆమె ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం స్థానికులు పలు సమస్యలు ఆమె దృష్టికి తీసుకెళ్లారు. ఇనాం భూములు గత ప్రభుత్వం నిర్వహించిన రీసర్వేలో భాగంగా ఫ్రీహోల్డ్‌లో పడ్డాయని, ప్రస్తుతం ఖరీఫ్ ముంచుకొస్తున్న నేపథ్యంలో రైతులు బ్యాంకుల నుంచి రుణాలు పొందలేకపోతున్నారన్నారు. సమస్యను పర్కిరించాలని కోరారు. డీటీ రెడ్డిశేఖర్‌ను సమస్య పరిష్కరించాలని మంత్రి ఆదేశించారు. బ్యాంక్ అధికారులతో మాట్లాడి రుణాలు ఇప్పించాలన్నారు. గ్రామ సచివాలయ సిబ్బంది విధులకు సరిగా హాజరు కావడంలేదని గ్రామంలో పారిశుధ్య చర్యలు చేపట్టడం లేదని పలువురు మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. అదేవిధంగా సుద్దకుంటపల్లిలో సైతం పారిశుధ్యంపై నిర్లక్ష్యం వహించడంతో సచివాలయ ఉద్యోగులపై మంత్రి మండిపడ్డారు. పంచాయతీకి నిధులు మంజూరు చేస్తుంది వాటిలో అభివృద్ధి పనులు చేపట్టడానికేనని హెచ్చరించారు. అనంతరం జూలకుంట ఉన్నత పాఠశాల ప్రహరీగోడ నిర్మించాలని ఆమె దృష్టికి తెచ్చారు. ప్రహరీ నిర్మాణానికి సంబంధించిన సమస్యలు పరిశీలించి త్వరలో నిర్మిస్తామన్నారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ గత ప్రభుత్వం జే బ్రాండ్‌లతో ప్రజల జీవితాలతో చలగాటం ఆడిందన్నారు. వారు ఎక్కడ దాక్కున్నా బయటకు తీసుకొచ్చి ప్రభుత్వం కఠినంగా శిక్షిస్తుందన్నారు. అదేవిధంగా ఆదివారం ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు జన్మదినాన్ని రాష్ట్ర వ్యాప్తంగా పండగలా జరుపుకోవాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు.

హంద్రీనీవా కాలువ పనులు పరిశీలించిన మంత్రి సవిత

సోమందేపల్లి మండలం నక్కలగుట్ట కాలనీ సమీపంలో చాకర్లపల్లి కుంటవద్ద తెగిన హంద్రీనీవా కాలువ మరమ్మతు పనులను శనివారం మంత్రి సవిత పరిశీలించారు. ఈ సందర్భంగా ఈఈ శ్రీనివాసులు, డీఈ రామసుబ్బయ్యలతో మాట్లాడుతూ కాలువ మరమ్మతు పనులను పటిష్టంగా చేపట్టాలన్నారు. కాలువ వెంబడి పరిశీలనచేసి అవసరమైన చోట ముందుస్తు మరమ్మతులు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో వాల్మీకి కార్పొరేషన్ డైరెక్టర్ డివి ఆంజనేయులు నాయకులు నీరుగంటది చంద్ర, కన్వీనర్ సిద్దలింగప్ప, సూరీ, ఆకుల రమణ, సూర్యనారాయణ, హరిక్రిష్ణ, వెంకటేశులు, కిష్టప్ప, నాగరాజు, నరసింహులు, తదితరులు పాల్గొన్నారు.

నీటి సమస్య రానీయకండి: మంత్రి సవిత

పెనుకొండ రూరల్, ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి): వేసవిలో జిల్లాలో ఏ గ్రామాల్లోనైనా తాగునీటి సమస్య రానీయ్యొద్దని ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులకు బీసీ సంక్షేమ చేనేత జౌళిశాఖ మంత్రి సవిత సూచించారు. ఈనెల 16న ఆంధ్రజ్యోతిలో తాగునీటి ఎద్దడిపై ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులతో ఇంటర్వ్యూ వెలువడింది. ఇందుకు స్పందించిన మంత్రి సవిత శనివారం పెనుకొండలోని మడకశిర రహదారిలోని టీడీపీ క్యాంప్ కార్యాలయంలో మంత్రి ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. వేసవిలో తాగునీటి సమస్య ఏ గ్రామంలోనూ తలెత్తకుండా చూడాలని 24గంటల్లో పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులు ఈఈ మల్లికార్జున, డీఈ శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.

న్యూస్ బాక్స్

రూ.20 కోట్లతో ప్రతిపాదనలు

ఇరిగేషన్ శాఖ డీఈ, తిరుమలేశ్వరరెడ్డి



మడకశిర, ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి): సువర్ణముఖి నదికి అడ్డంగా పది చోట్ల సబ్‌సర్ఫేస్ చెక్‌డ్యాంల నిర్మాణాలకు రూ. 20కోట్లతో ప్రతిపాదనలు పంపుతున్నామని, నిధులు మంజూరు అయిన వెంటనే నిర్మాణాలు చేపడతామని ఇరిగేషన్ శాఖ డీఈ తిరుమలేశ్వరరెడ్డి తెలిపారు. ఆయన శనివారం ఆంధ్రజ్యోతితో మాట్లాడారు.

ప్రశ్న: నియోజకవర్గంలో ఇరిగేషన్ శాఖ పరిధిలో ఎన్ని చెరువు ఉన్నాయి..? ఆయకట్టు ఎంత ఉంది?

జవాబు: నియోజకర్గంలో ఇరిగేషన్‌శాఖ పరిధిలోను పిర్ పరిధిలో 125 చెరువులు ఉన్నాయి, ఇందులో ఇరిగేషన్ శాఖ పరిధిలో 100 ఎకరాల ఆయకట్టు ఉన్న చెరువులు 47, 100 ఎకరాలు పైన ఆయకట్టు ఉన్న చెరువులు 78 ఉన్నాయి.

ప్రశ్న: చెరువుల కింద ఆయకట్టు ఎన్ని ఎకరాలు ఉంది..? ఎన్ని ఎకరాలలో పంటలు సాగు చేశారు?

జవాబు: చెరువుల కింద ఆయకట్టు 11,131 ఎకరాలు ఉంది. పది సంవత్సరాలు క్రితం తీవ్ర వర్షాభావం నెలకొనడంతో భూగర్భ జలాలు అడుగంటిపోయి తాగు, సాగునీటికి ఇబ్బందులు పడేవారు. భూగర్భ జలాలు పెంపొందించడానికి, చెరవులలోని నీటితో పంటలు సాగు చేయకుండా, చెరువుల తూములను మూసివేయించారు. దీంతో పంటలు సాగుకాలేదు.

ప్రశ్న: దెబ్బతిన్న చెరువుల మరమ్మతులకు ప్రతిపాదనలు పంపారా?

జవాబు: దెబ్బతిన్న చెరువుల మరమ్మతులకు ప్రతిపాదనలు పంపుతాము. చెరువుల తూములు, కట్టల మరమ్మతులతోపాటు కంపచెట్టను తొలగించడం, అందులో పూడిక తీయడం, కోతకు గురైన కాలువల మరమ్మతులు, పూడిక తొలిగింపు తదితరవాటికి ప్రతిపాదనలు పంపుతున్నాం. నిధులు మంజూరు అయిన వెంటనే పనులు చేడుతాం.

ప్రశ్న: చెక్‌డ్యాంల నిర్మాణాలకు ప్రతిపాదనలు పంపారా?

జవాబు: సువర్ణముఖి నదికి అడ్డంగా పది చోట్ల చెక్‌డ్యాంల నిర్మాణాలకు రూ.20 కోట్లతో ప్రతిపాదనలు పంపుతున్నాం. నిధులు మంజూరు అయిన వెంటనే వాటి నిర్మాణాలు చేపట్టడం జరుగుతుంది.

ప్రశ్న: గతంలో నీరు చెట్టు కింద చేపట్టిన పనులకు బిల్లులు మంజూరయ్యాయా..?

జవాబు: ఐదు సంవత్సరాల కిందట నీరు చెట్టు కింద చేపట్టిన పనులకు పెండింగ్ ఉన్న బిల్లులకు రెండు కోట్ల దాకా బిల్లులు చెల్లించారు. ఇంకా పెండింగ్ ఉన్న బిల్లులు కూడా త్వరలోనే మంజూరు అవుతాయి.

శ్రీహరికోటను సందర్శించిన విద్యార్థులు



శ్రీహరి కోట పరిశోధన కేంద్రంలో విద్యార్థినులు

మడకశిర రూరల్, ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి): మండలంలోని రేకులకుంట ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న గాయత్రిసింధు, 8వ తరగతి చదువుతున్న అనుశ్రీ చదనతోపాటు భౌతికశాస్త్ర ఉపాధ్యాయురాలు విజయభార్గవి శ్రీహరికోటను సందర్శించినట్లు హెచ్‌ఎం గిరిజ తెలిపారు. విద్యార్థి దశ నుంచి విజ్ఞాన శాస్త్రానికి సంబంధించిన విషయాలను తెలియజేయడానికి రాష్ట్రప్రభుత్వం విజ్ఞాన విహారయాత్రను ప్రవేశపెటిందన్నారు. అందులో భాగంగానే పాఠశాల విద్యార్థులు నెల్లూరు జిల్లా శ్రీహరికోటలోని షార్, కుప్పంలోని అగస్త్య ఫౌండేషన్‌ను సందర్శించి అక్కడి విషయాలను తెలుసుకుని వచ్చారన్నారు.

పట్టణ సుందరీకరణ పనులకు ప్రణాళికలు



ఎన్టీఆర్ సర్కిల్‌వద్ద మరమ్మతులు చేస్తున్న దృశ్యం

సోమందేపల్లి, ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో కొత్తపల్లి క్రాస్ నుంచి పెద్దమ్మగుడి వరకు డివైడర్లపై బటర్‌ఫ్లై లైట్లను ఏర్పాటుచేసి సుందరీకరణ పనులను చేపట్టడానికి ఇటీవల తీర్మానాన్ని ఆమోదించినట్లు పంచాయతీ కార్యదర్శి రామాంజినేయులు తెలిపారు. ఈ దిశలో అవసరమైన నిధుల కోసం ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నామన్నారు. టీడీపీ నాయకులు నీరుగంటి చంద్ర మాట్లాడుతూ పట్టణ అభివృద్ధి సుందరీకరణపనులు చేపడుతున్నామన్నారు. ఎన్టీఆర్ సర్కిల్ నుంచి కొత్తపల్లి వరకు డివైడర్‌ను పునర్‌నిర్మించి లైట్లను ఏర్పాటుచేయడంతోపాటు మొక్కలు నాటనున్నామన్నారు.

రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో తాగునీటి సౌకర్యం



వాటర్‌ప్లాంట్ ప్రారంభిస్తున్న చైర్మన్, కమిషనర్

హిందూపురం, ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి): హిందూపురం మున్సిపల్ కార్యాలయం ఆవరణంలో రోటరీక్లబ్ ఆధ్వర్యంలో ఆర్‌ఓ వాటర్‌ప్లాంట్‌ను ఏర్పాటు చేశారు. దీనిని శనివారం మున్సిపల్ చైర్మన్ రమేష్, కమిషనర్ సంఘం శ్రీనివాసులు ప్రారంభించారు. సుమారు రూ.1.20లక్షలు విలువచేసే ప్యూరిఫైడ్ వాటర్‌ను ఏర్పాటుచేసినట్లు రోటరీక్లబ్ సభ్యులు తెలిపారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ వేసవిలో కార్యాలయానికి వచ్చే ప్రజలకు ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. దీనికి ఆర్థిక సాయం చేసిన బద్రీనాథ్‌ను అభినందించారు. ఈ కార్యక్రమంలో రోటరీక్లబ్ సభ్యులు, టీడీపీ నాయకులు అయూబ్, నవీన్, అమీన్, నజీర్ పాల్గొన్నారు.

కుట్టుశిక్షణ కేంద్రం ప్రారంభం

పెనుకొండ రూరల్, ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి): రొద్దం మండలంలోని తురకలాపట్నంలో ఉచిత కుట్టుశిక్షణ కేంద్రాన్ని శనివారం ప్రారంభించారు. మహిళలు అన్నిరంగాల్లో రాణించాలనే ఉద్దేశంతో కుట్టుశిక్షణ కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు టీడీపీ నాయకులు మాధవనాయుడు, మాజీ సర్పంచ్ అశ్వర్థనారాయణ తెలిపారు.

పురంలో రన్‌ఫర్ జీసస్



రన్‌ఫర్ జీసస్ కార్యక్రమంలో పాల్గొన్న డీఎస్పీ, సీఐలు, క్రైస్తవులు

హిందూపురం, ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి): గుడ్‌ఫ్రైడే, ఈస్టర్ పర్వదినాలు పురస్కరించుకుని పట్టణంలో శనివారం రన్‌ఫర్ జీసస్ నిర్వహించారు. కార్యక్రమానికి డీఎస్పీ మహేష్, సీఐలు రాజగోపాల్‌నాయుడు, అబ్దుల్ కరీముల్లా హాజరై జెండా ఊపి రన్‌ఫర్ జీసస్ ప్రారంభించారు. ఈ సందర్భంగా పాస్టర్‌లు మాట్లాడుతూ యేసు ప్రభువు దయామయుడని ప్రజలందరిపై ఆయన కృప ఉంటుందన్నారు. ప్రజలు మంచిమార్గంలో నడిపించడానికి ఉద్భవించిన ప్రేమమయుడన్నారు. కార్యక్రమంలో సీఅండ్ఐజీ మిషన్‌చర్చ్, మిషన్ కాంపౌండ్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ నాగేంద్ర, రెవరెండర్ డాక్టర్ స్టీఫెన్, ప్రకాశ్, కిరణ్‌మోహన్, సాల్మన్‌రాజ్, అరుణ్‌కుమార్, దేవరాజ్ , ఉదయ్ పాల్గొన్నారు.

జాతీయ లోక్ అదాలత్‌ను జయప్రదం చేయండి

న్యాయాధికారి అశోక్‌కుమార్

మడకశిర టౌన్, ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి): జాతీయ లోక్ అదాలత్‌ను మే 10వతేదీన నిర్వహించడం జరుగుతుందని న్యాయాధికారి అశోక్‌కుమార్ తెలిపారు. మడకశిర కోర్టు ఆవరణంలో నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. శనివారం నియోజకవర్గంలోని సీఐలు ఐదు మండలాల ఎస్‌ఐలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా న్యాయాధికారి మాట్లాడుతూ రాజీ అయ్యే కేసులను పరిష్కరించడం జరుగుతుందన్నారు. రాజీమార్గమే రాజమార్గం అని, సామరస్యంగా కేసులు పరిష్కరించుకోవడం ద్వారా సమయం డబ్బు ఆదా అవుతాయన్నారు. జాతీయ లోక్‌అదాలత్‌ను విజయవంతం చేయాలని కోరారు. సీఐలు నాగేష్ బాబు, రాజ్‌కుమార్, ఎస్‌ఐలు పాల్గొన్నారు.

వృద్ధాప్యంలో ప్రశాంత జీవనం గడపాలి

న్యాయాధికారి శైలజ



దుస్తులు పంపిణీ చేస్తున్న న్యాయాధికారి

హిందూపురం, ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి): వృద్ధాప్యంలో ఎలాంటి మానసిక ఆందోళనకు గురికాకుండా ప్రశాంత జీవనం గడపాలని హిందూపురం అదనపు న్యాయాధికారి కంపల్లె శైలజ సూచించారు. శనివారం పలు వృద్ధాశ్రమాల్లో న్యాయవిజ్ఞాన సదస్సులు నిర్వహించారు. ఈ సందర్భంగా న్యాయాధికారి మాట్లాడుతూ అర్హులైన వారికి పింఛన్లు అందకుంటే అధికారుల దృష్టికి తీసుకెళ్లి మంజూరయ్యేలా చర్యలు తీసుకుంటామన్నారు. అనంతరం దుస్తులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వన్‌టౌన్ సీఐ రాజగోపాల్ నాయుడు, న్యాయవాదులు శ్రీనివాసరెడ్డి, సంతోష్‌కుమారి పాల్గొన్నారు.

ఓటరు జాబితాపై సమీక్ష

మడకశిర రూరల్, ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి): రాజకీయపార్టీల భాగస్వామ్యంతోనే తప్పులులేని ఓటరు జాబితా తయారు సాధ్యమని స్పెషల్ డిప్యూటీ కలెక్టర్, నియోజకవర్గ ఎన్నికల అధికారి సూర్యనారాయణ రెడ్డి పేర్కొన్నారు. శనివారం తహసీల్దార్ కార్యాలయంలో వివిధ రాజకీయపార్టీల నాయకులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓటరు జాబితాలో పేరు నమోదు, తొలగింపు, సవరణ, ఇతర క్లైంలకు సంబంధించిన అంశాలపై వచ్చిన దరఖాస్తులను ఎప్పటికప్పుడు తెలుసుకొనే వెసులుబాటును భారత ఎన్నిల కమిషన్ కల్పించిందన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ కరుణాకర్, డిప్యూటీ తహసీల్దార్ లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

కర్ణాటక మద్యం స్వాధీనం

హిందూపురం, ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి): కర్ణాటక నుంచి మద్యాన్ని అక్రమంగా తీసుకొస్తున్న నిందితులను అరెస్ట్‌చేసి వారి నుంచి మద్యం స్వాధీనం చేసుకున్నట్లు ఎక్సైజ్ సీఐ లక్ష్మీదుర్గయ్య తెలిపారు. చిలమత్తూరు మండలానికి చెందిన వ్యక్తితోపాటు హిందూపురానికి చెందిన రామాంజి, నేతాజీనగర్ మంజుళ, మారుతిని అరెస్ట్‌చేసి వారి నుంచి 205 విస్కీ టెట్రాప్యాకెట్లు, ద్విచక్రవాహనాన్ని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. దాడుల్లో ఎస్ఐ ఫారూక్, నారాయణస్వామి పాల్గొన్నారు.

ఆలయానికి విరాళం



విరాళం అందజేస్తున్న దృశ్యం

హిందూపురం, ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి): కొట్నూరు ఇందిరమ్మ కాలనీలో నిర్మిస్తున్న వెంకటేశ్వరస్వామి ఆలయానికి కొట్నూరుకు చెందిన చంద్రశేఖర్ రూ.1.5లక్షలు విరాళం అందజేశారు. ఇటీవల కాలనీలో టీడీపీ నాయకులు పర్యటించారు. ఈ సందర్భంగా కాలనీవాసులు ఆలయానికి విరాళం కావాలని అడగ్గా శనివారం మొత్తాన్ని వారికి అందించారు. ఈ కార్యక్రమంలో రామక్రిష్ణ, నంజుండ, అనీల్, మహేష్, నారాయణప్ప తదితరులు పాల్గొన్నారు.

గ్రామ పంచాయతీ ఉపాధ్యక్షురాలిగా నాగలక్ష్మి ఎన్నిక

పావగడ, ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి): కామనదుర్గ గ్రామ పంచాయతీ ఉపాధ్యక్షురాలిగా భూపూరు గ్రామానికి చెందిన నాగలక్ష్మమ్మ శనివారం జరిగిన ఉపాధ్యక్ష ఎన్నికల్లో ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. చివరి విడత ఉపాధ్యక్ష పదవికి నాగలక్ష్మీ మాత్రమే నామినేషన్ దాఖలు చేయడంతో ఎటువంటి పోటీ లేకుండా ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు వరదరాజు ప్రకటించారు.



ఏకగ్రీవంగా ఎన్నికైన నాగలక్ష్మి

పరిసరాల పరిశుభ్రతపై అవగాహన

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలంటూ పలువురు అధికారులు, నాయకులు శనివారం అవగాహన కల్పించారు. స్వచ్ఛాంధ్రలో భాగంగా పలువురు అధికారులు కార్యాలయాల వద్ద పరిసరాలను శుభ్రం చేయగా కొందరు ర్యాలీ నిర్వహించి అవగాహన కల్పించారు.

హిందూపురం, ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి): మునిసిపాలిటీల్లో ఈ వ్యర్థాలను వదిలించుకోవడానికి స్వర్ణాంధ్ర స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా మూడో శనివారం హిందూపురంలో ప్రత్యేక కార్యచరణ చేపట్టారు. శనివారం మునిసిపల్ చైర్మన్ రమేష్, కమిషనర్ శ్రీనివాసులు ఆధ్వర్యంలో శానిటేషన్ చేపట్టారు. ఎన్టీఆర్ సర్కిల్ నుంచి గురునాథ్ సర్కిల్ వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం చైర్మన్ మాట్లాడుతూ ఈ వ్యర్థాలను సురక్ష పద్ధతిలో రీసైకిల్ చేయవచ్చన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు అంజలీ, నాగమణి, నాగేంద్రమ్మ, ఇర్షాద్, అయూబ్, నాయకులు పరిమళ, మునిసిపల్ సిబ్బంది శోభన్‌రెడ్డి, శంకర్ పాల్గొన్నారు.

● గోరంట్ల : ప్రతిఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రతతోపాటు పరిసర ప్రాంతాలను శుభ్రంగా ఉంచినప్పుడే సంపూర్ణ ఆరోగ్యవంతులవుతారని అధికారులు పేర్కొన్నారు. శనివారం స్వర్ణాంధ్ర, స్వచ్ఛంధ్రా కార్యక్రమంలో భాగంగా మండలకేంద్రంలో అధికారులు ర్యాలీ చేసి బస్టాండ్ ప్రాంతంలో మానవహారం ఏర్పాటు చేశారు. డీపీఓ సమత, తహసీల్దార్ మారుతి ఈ సందర్భంగా ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ గోపాల్, పంచాయతీ ఈఓ సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

● సోమందేపల్లి : మండల కేంద్రంలో శనివారం స్వచ్ఛభారత్ స్వచ్ఛదివాస్ నిర్వహించారు. డీఎల్‌పీఓ సూర్యనారాయణ దగ్గరుండి జేసీబీలతో మురుగు కాలువలు శుభ్రం చేశారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రామాంజినేయులు, సిబ్బంది పాల్గొన్నారు. పోలీస్‌స్టేషన్‌లో స్వచ్ఛభారత్‌ను ఎస్ఐ రమేష్ ఆధ్వర్యంలో చేపట్టారు.

● పెనుకొండ : పరిసరాల పరిశుభ్రత ప్రతిఒక్కరి బాధ్యత అని ప్రిన్సిపాల్ సుదర్శన్ పేర్కొన్నారు. శనివారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రిన్సిపాల్ సుదర్శన్ ఆధ్వర్యంలో స్వచ్ఛఆంధ్ర నిర్వహించారు. కార్యక్రమంలో అధ్యాపకులు బషీర్‌అహ్మద్, మూర్తి, శివన్న, శంకరప్ప, సుధారాణి, సుజాత, ఎన్ఎస్ఎస్ పీఓలు హఫీజ్, శంకర్‌నాయక్, శ్రీలేఖ తదితరులు పాల్గొన్నారు.



గోరంట్లలో ప్రతిజ్ఞ చేయిస్తున్న అధికారులు

డంపింగ్ యార్డ్ పరిశీలన



డంపింగ్‌యార్డు పనితీరును ఈఓతో తెలుసుకుంటున్న హరినారాయణ

గోరంట్ల, ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని రావికుంటచెరువు వద్ద ఉన్న డపింగ్‌యార్డును జిల్లా ప్రత్యేకాధికారి హరినారాయణ శనివారం పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ స్వచ్ఛాంధ్ర 2047 సంకల్పంతో రాష్ట్రప్రభుత్వం ప్రతినెల స్వచ్ఛదివాస్ నిర్వహిస్తోందన్నారు. ప్రతి పంచాయతీలోని ఇంటింటికెళ్లి సేకరించినచెత్తను తడి, పొడిగా వేరు చేసి వర్మీకంపోస్టు వృద్ధి చెందేలా చూడాలని ఆదేశించారు. డపింగ్‌యార్డు పనితీరు, సంపద ఉత్పత్తిని పరిశీలించి, వివరాలు అడిగి తెలుసుకున్నారు. దుకాణదారులు, హోటల్ దుకాణాల వారు చెత్తను రోడ్లపై వేయకూడదని ఆదేశించారు. మనమిత్ర వాట్సాప్ గ్రూపు సేవల వినియోగంపై ఆరాతీశారు. శక్తియాప్, మనమిత్ర యాప్‌లో అందుబాటులో ఉన్న సేవల గురించి విస్తృత ప్రచారం చేయాలని చెప్పారు. ఆన్‌లైన్ మోసాలు జరగకుండా సైబర్ సెక్యూరిటీ, క్యూఆర్ కోడ్‌ద్వారా చేయాలన్నారు. ఆయనతోపాటు డీపీఓ సమత, ఆర్డీవో సువర్ణ, తహసీల్దార్ మారుతి, పంచాయతీ ఇఓ సుబ్రహ్మణ్యం, సచివాలయ, పంచాయతీ సిబ్బంది ఉన్నారు.

హంద్రీనీవా కాలువగట్లను పటిష్టం చేయాలి

- జలసాధన సమితి నాయకులు



హంద్రీనీవా కాలువ పనులు పరిశీలిస్తున్న జలసాధన సమితి బృందం

సోమందేపల్లి, ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి): హంద్రీనీవా కాలువగట్లు బలహీనంగా ఉండటంతో తెగిపోతున్నాయని, వాటిని పటిష్టం చేయాలని జలసాధన సమితి నాయకులు ప్రభుత్వాన్ని కోరారు. శనివారం సోమందేపల్లి మండలం చాకర్లపల్లి కుంటవద్ద తెగిన హంద్రీనీవా కాలువను వారు పరిశీలించారు. అనంతరం ఈఈ శ్రీనివాసులతో మాట్లాడి వివరాలు తీసుకున్నారు. అనంతరం వారు మాట్లాడుతూ కాలువలు లోతుగా తవ్వి కాంక్రీట్ పనులు చేసి ఉంటే గట్లు తెగి ఉండేవికావని, పైపైనే తవ్వి అదే మట్టితో గట్లు నిర్మించడంవల్ల తరచూ గండ్లు పడుతున్నాయన్నారు. గత యేడాది మంచేపల్లివద్ద వర్షపునీటికి హంద్రీనీవా కాలువ తెగిందన్నారు. అదేవిధంగా ఈనెలలో రెండుసార్లు గట్లు తెగాయన్నారు. మడకశిర బ్రాంచ్ కెనాల్ ద్వారా 240చెరువులు నింపడం ప్రభుత్వ లక్ష్యం కాగా అందుకు ఈ కాలువలు సరిపోవన్నారు. గొల్లపల్లి రిజర్వాయర్ నిండిన నాలుగు నెలల తరువాత నీటిని విడుదల చేశారన్నారు. కేవలం 26చెరువులు మాత్రమే నింపారన్నారు. కాలువలను వెడల్పుచేసి వెయ్యిక్యూసెక్కుల నీటిని పారేలా మరమ్మతులు చేపట్టారన్నారు. కార్యక్రమంలో ఉమ్మడిజిల్లా కార్యదర్శి గంగిరెడ్డి పాల్గొన్నారు.

అగ్నిప్రమాదాలపై అవగాహన

మడకశిర రూరల్, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కదిరేపల్లి పీహెచ్‌సీలో శనివారం అగ్నిప్రమాదాలు జరిగినప్పుడు ఏ విధంగా రక్షించుకోవాలి అన్న విషయంపై మడకశిర ఫైర్‌స్టేషన్ అధికారి విజయ్ కుమార్ ఆధ్వర్యంలో అవగాహన నిర్వహించారు. అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా ఈ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. పీహెచ్‌సీ అవరణంలో అగ్నిప్రమాదలు సంభవించినప్పుడే ఏవిధంగా మంటలు ఆర్పాలో అన్నదానిపై డెమో చేసి చూపించారు. కార్యక్రమంలో డాక్టర్ నరేష్ తదితరులు పాల్గొన్నారు.

పెనుకొండ టౌన్, (ఆంధ్రజ్యోతి): అగ్ని ప్రమాదాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని ఫైర్ ఎస్ఐ వెంకటేశులు సూచించారు. అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా శనివారం స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో డాక్టర్, నర్సులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా అగ్ని ప్రమాదాలు జరిగినప్పుడు ఎలా రక్షణ పొందాలో డెమోచేసి చూపించారు. ఈ కార్యక్రమంలో ఫైర్ సిబ్బంది, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

హిందూపురం, (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఆసుపత్రిలో చిన్న పిల్లల వార్డుల్లో అగ్ని ప్రమాదాలు జరిగితే తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అగ్నిమాపక అధికారులు అవగాహన కల్పించారు. అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా శనివారం ప్రభుత్వ ఆసుపత్రి మాత శిశు సంరక్షణ కేంద్రం వద్ద అగ్నిమాపక అధికారులు ఎప్పుడైనా షార్ట్‌సర్క్యూట్ జరిగినా, అగ్ని ప్రమాదం జరిగినా ఎలా జాగ్రత్తలు తీసుకోవాలో తెలియజేశారు. అదేవిధంగా మంటలు ఆర్పడానికి సిబ్బంది తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలిపారు. రోగులను ఆసుపత్రి నుంచి ఎలా రక్షించాలో డెమోద్వారా చూపించారు. కార్యక్రమంలో అగ్నిమాపక అధికారి ప్రభాకర్, ఆసుపత్రి సూపరింటెండెంట్ లింగన్న, ఆర్‌ఎంఓ డేవిడ్‌రాజ్, చంద్రకళ, ఓబుళమ్మ పాల్గొన్నారు.

'బియ్యం సక్రమంగా పంపిణీ చేయండి'

గోరంట్ల, ఏప్రిల్19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చౌకధాన్యపు దుకాణాల డీలర్లు సక్రమంగా బియ్యం పంపిణీ చేయాలని, లేనిపక్షంలో కఠిన చర్యలు తప్పవని అధికారులు హెచ్చరించారు. శనివారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో తహసీల్దార్ మారుతి, సిఎస్ డిటీ శ్రీధర్ డీలర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కచ్చితమైన తూకాలతో బియ్యం పంపిణీ చేయాలన్నారు. అదేవిధంగా బఫర్ స్టాక్‌ను క్రమంగా తగ్గించుకుంటూ ప్రతి డీలర్ సమస్యను పరిష్కరించుకోవాలన్నారు.

కొడవలితో దాడి

పరిగి, ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని కొడిగెనహళ్లి గ్రామంలో ఓ ప్రైవేటు ఫైనాన్స్ ఉద్యోగిపై కొడవలితో దాడిచేసినసంఘటన శనివారం చోటుచేసుకుంది. ఎస్ఐ రంగడుయాదవ్ తెలిపిన వివరాల మేరకు కొన్ని నెలల క్రితం ఫాస్ట్‌ఫుడ్ సెంటర్ నిర్వాహకుడు రాజు రూ.40వేలు ఫైనాన్స్ కింద లోన్ తీసుకున్నాడు. ఈ విషయంపై శుక్రవారం ఆ ఫైనాన్స్ సంస్థకు చెందిన ఉద్యోగి బాలాజీ డబ్బులు కట్టమని రాజును అడగ్గా వారి మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. శనివారం ఒంటరిగా ద్విచక్రవాహనంలో వెళ్తున్న బాలాజీని ఫాస్ట్ ఫుడ్ నిర్వాహకుడు రాజు కాలువపల్లి పెట్రోల్ బంక్ నుంచి కొడిగెనహళ్లి ఎస్సీ కాలనీ వరకు వెంటాడి కొడవలితో దాడిచేశాడు. బాలాజీకి తలకు, వీపుపై, చేయికి గాయాలయ్యాయి. స్థానికులు గమనించి బాలాజీని హుటాహుటిన హిందూపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్సలు అందించారు. అయితే బాలాజీ పరిస్థితి నిలకడగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు. కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. రాజును అదుపులోకి తీసుకుని రిమాండుకు తరలించినట్లు తెలిపారు. ఇతడిపై గతంలోనూ పలు కేసులున్నట్లు గుర్తించారు.